



Truth of News

PRGI Reg No: APTEL/26/A4782

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

అన్నమయ్య జిల్లా | సంపుటి: 01 | సంచిక : 365 | ఆదివారం 26 జూలై 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

# జయహో జెన్ జీ

రాజ్యహింస మీద 'విద్యార్థి' విజయం సాధించాడు. ఆ విజయం కోసం తన ఒళ్లు హూనం చేసుకున్నాడు. పరిస్థితులు చేతులు దాటి సమస్య విశ్వవ్యాప్తమవుతున్నదని భయపడిన మోడీ సర్కార్ 'జెన్ జీ' పోరాటానికి తలవంచక తప్పలేదు. 'నీట్' సహా పలు పరీక్షల ప్రశ్నా పత్రాల లీకేజీలకు బాధ్యుడైన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయక తప్పలేదు. నిముషాల వ్యవధిలోనే ఆయన రాజీనామాను రాష్ట్రపతి ద్రౌపదీముర్ము ఆమోదించారు. ఆ వెంటనే కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజాపంపిణీ, నూతన పునరుత్పాదక ఇంధనశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి అదనంగా విద్యాశాఖ బాధ్యతలు అప్పగించారు. ఈ నిర్ణయాలన్నీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోనే జరిగాయి. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను కాక్రోచ్ జనతాపార్టీ (సీజేపీ) స్వాగతించింది.

ప్రాణాలకు తెగించి మోడీ ప్రభుత్వంపై పోరాడిన విద్యార్థి, యువజన ఉద్యమ స్ఫూర్తిని సీపీఐ(ఎం), సీపీఐ, కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలన్నీ కీర్తించాయి. యువతరం మార్పును కోరుకుంటోంది అనడానికి ఇదే నిదర్శనమని ఆపార్టీల నాయకులు చెప్పారు. మరోవైపు కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌లతో సీజేపీ ప్రతినిధులు జరిపిన చర్చలు సఫలం అయ్యాయి. వారి మిగిలిన డిమాండ్లను కూడా పరిష్కరిస్తామని కేంద్ర మంత్రులు హామీ ఇచ్చారు. విద్యార్థుల కోసం 26 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసిన సోనమ్ వాంగ్‌చుక్ ఇది 'జెన్ జీ' విజయం అని కొనియాడారు. దేశ యువతను, ప్రజల్ని మతం మత్తులో ఉంచి రాజకీయాలు చేస్తూ, మనుస్మృతిని అమల్లోకి తేవాలని తీవ్రంగా శ్రమిస్తున్న బీజేపీ, దాని మాతృసంస్థ ఆర్‌ఎస్‌ఎస్‌కు ఇది పెద్ద ఎదురు దెబ్బే! సుమతీ శతకకారుడు ఈ 'జెన్ జీ' పోరాటాన్ని చూసి ఉంటే.."బలవంతుడైన పాలకుడు 'బొద్దింకల' చేత చిక్కి తలవంచునె సుమతీ"..అని కచ్చితంగా రాసి ఉండేవారు!!




## - కేంద్ర విద్యాశాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా



- యువోద్యమంతో దిగొచ్చిన మోడీ సర్కార్.. దేశవ్యాప్తంగా బీజేపీ వ్యతిరేకపవనాలు
- కేంద్ర మంత్రులతో సీజేపీ నేతల చర్చలు సఫలం..డిమాండ్ల పరిష్కారానికి అంగీకారం
- ఆందోళనలు విరమిస్తున్నట్లు సీజేపీ ప్రకటన..
- విద్యార్థుల పోరాటస్ఫూర్తిని కొనియాడిన ప్రతిపక్షాలు..
- ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖ అదనపు బాధ్యతలు

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

నీట్ ప్రశ్నాపత్రం లీక్, సీబీఎస్ఇ అవకతవకలకు జవాబుదారీతనం వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ గత 36 రోజులుగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ ) ఆధ్వర్యంలో జరిగిన విద్యార్థి, యువత చేసిన ఉద్యమం విజయం సాధించింది. ఎట్టకేలకు కేంద్ర మంత్రి రాజీనామాతో పాటు సీజేపీ ప్రతిపాదించిన డిమాండ్లకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించడంతో విద్యార్థి, యువత విజయ యాత్ర చేపట్టారు. జంతర్ మంతర్‌లో సంబరాలు మిన్నంటాయి. ఐక్య పోరాట నినాదాలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. తమకు ఎదురే లేదనుకున్న అధికారపార్టీ నాయకులు... విద్యార్థులు, యువత చేపట్టిన ఉద్యమానికి తలొగ్గక తప్పలేదు. ఉగ్రవాదులకు సీజేపీ బీ టీం, సంఘ విద్రోహశక్తులంటూ విమర్శలు చేసిన నేతలే, ఉద్యమిస్తోన్న విద్యార్థులు, యువతే నిజమైన దేశభక్తులంటూ పరోక్షంగా అంగీకరించాల్సి వచ్చింది. ఇదొక చారిత్రాత్మక, ప్రజాస్వామ్య విజయమంటూ విద్యార్థి, యువజన సంఘాల నేతలు పేర్కొన్నారు. ఈ విజయం భవిష్యత్తుకు స్ఫూర్తి, విద్యార్థులలు, యువత సమిష్టి విజయమని ప్రతిపక్ష నేతలు అన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో పాటు ఇతర డిమాండ్లకు కేంద్ర ప్రభుత్వం అంగీకరిస్తూ హామీ ఇవ్వడంతో ఆందోళనలు విరమిస్తున్నట్లు సీజేపీ ప్రకటించింది.

విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నా అధికారాన్ని అంటిపెట్టుకుని ఉన్న కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, దేశంలోని విద్యార్థి, యువజనులు ఉద్యమించడంతో రాజీనామా చేశారు. సీజేపీ ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఏ, ఏఐఎస్ఎఫ్, తదితర విద్యార్థి సంఘాల నాయకత్వంలో జంతర్ మంతర్ వద్ద ప్రారంభమై, ఆ తరువాత దేశవ్యాప్తంగా విస్తరించిన ఉద్యమం, బీజేపీ రాజకీయ రక్షణ వలయాన్ని బద్దలు కొట్టి, కేంద్ర మంత్రి ప్రధాన్ చేత రాజీనామా చేయించింది. ఈనెల 20న సీజేపీ నిర్వహించిన పార్లమెంటరీ మార్చ్ తర్వాత కూడా ప్రధానమంత్రి మోడీ, కేంద్ర మంత్రి ప్రధాన్ రాజీనామాను నివారించడానికి అన్ని ఎత్తుగడలూ వేసి విఫలమయ్యారు. పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన నిరాహార దీక్ష కూడా ప్రభుత్వ వ్యతిరేక అలలను సృష్టించింది.

- మిగతా 2లో..



## విద్యాశాఖ మంత్రిగా ప్రహ్లాద్ జోషి



కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన విషయం తెలిసిందే. తాజాగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము దీనిని ఆమోదించారు. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖ మంత్రిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రధానమంత్రి సూచన మేరకు రాష్ట్రపతి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

## విద్యార్థుల పోరాటానికి సెల్యూట్..
### - వారికి ప్రధాని క్షమాపణ చెప్పాలి



నీట్-జీ ప్రశ్నపత్రం లీక్ వివాదం నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన అనంతరం కాంగ్రెస్ అగ్రనాయకుడు, లోక్‌సభ ప్రతిపక్ష నేత (ఎల్ఓపీ) రాహుల్ గాంధీ.. కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల విజయమని అన్నారు. ఇప్పుడు మోడీ ప్రభుత్వాన్ని సాగనంపాల్సిన సమయం వచ్చిందని వ్యాఖ్యానించారు. అలాగే విద్యార్థులకు ప్రధాని మోడీ క్షమాపణ చెప్పాలనీ, నిరసనల సందర్భంగా పోలీసు హింసపై బాధ్యులపై చర్యలు

- మిగతా 2లో..

## ప్రజాస్వామ్యం గెలిచింది
### - సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే



బొద్దింకల సత్తా అందరికీ తెలిసొచ్చిందని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే అన్నారు. నీట్ పేపర్ లీక్ బాధితులకు న్యాయం దక్కిందని వ్యాఖ్యానించారు. బొద్దింకలు ఒకసారి వస్తే వెళ్లగొట్టడం సాధ్యం కాదని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఇది విద్యార్థుల విజయమని అన్నారు. తమని తాము బాద్‌షాలుగా భావిస్తున్న వారిని దారిలోకి తేవాల్సిన అవసరం ఉందని అన్నారు. యువత ఓట్లతోనే వారు నేడు అధికారంలో ఉన్నారన్నారు. ఎవరికీ భయపడాల్సిన

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## 21 ఏండ్లకే యువత ఎంపీలు, ఎమ్మెల్యేలవ్వాలి

- అసెంబ్లీలో తీర్మానించి కేంద్రానికి పంపుతాం లోక్‌సభలో జెన్ జీ
- ఒక శాతం కంటే తక్కువే రాహుల్ మంత్రివర్గంలో వారికే విద్యా శాఖ
- జెన్ జీ పోరాటం ఆగొద్దు.. ముందుకెళ్లాలి : ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి పిలుపు
- విద్యార్థులపై దాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ



హైదరాబాద్- సూర్య వాస్తవం

దేశంలోని యువతకు రాజీవ్‌గాంధీ 18 ఏండ్లకే ఓటు హక్కు కల్పించారు. స్థానిక సంస్థల్లో ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యేందుకు వయో పరిమితిని 21 ఏండ్లుగా

- మిగతా 2లో..

## ఆగస్టు నుంచి 'సంజీవని'.. సద్వినియోగం చేసుకోండి

- ఆగస్టు నుంచి ఏపీలో సంజీవని ఆరోగ్య పథకం అమలు
- ప్రతి వ్యక్తికి డిజిటల్ హెల్త్ ప్రొఫైల్
- వేదవతి ప్రాజెక్టును పూర్తి చేసి సాగునీరు అందిస్తామని హామీ
- గత ప్రభుత్వం ఒక్కప్రాజెక్టు పూర్తి చేయలేదని సీఎం విమర్శ
- పరదాలు కట్టకుండా ప్రజల మధ్యకు వస్తున్నానన్న చంద్రబాబు



2లో

# జయహో జెన్‌జీ

(మొదటిపేజీ తరువాయి)

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేయడానికి, పరీక్షల్లో మోసానికి పాల్పడేవారికి కఠిన శిక్షలు విధించడానికి ఒక బిల్లును ప్రవేశపెట్టినప్పటికీ, ఎన్‌టిఎలో కీలక అధికారులను తొలగించినప్పటికీ, విద్యార్థులు ప్రధాన్ రాజీనామాకే కట్టుబడి ఉన్నారు. పోలీసుల అణచివేతను వ్యతిరేకిస్తూ విద్యార్థులు ఒక కొత్త పోరాట గాథను లిఖించారు. "ఇది మొదటి విజయం. మనం ఇక్కడితో ఆగిపోము. ఇది కేవలం ఆరంభం మాత్రమే. గత 36 రోజులుగా ఇక్కడ కూర్చుని ఉన్న విద్యార్థులు, స్వచ్ఛంద కార్యకర్తలందరికీ నేను వందనం చేస్తున్నాను" అని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే అన్నారు.

### ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా


విద్యార్థి, యువజన ఉద్యమంలో కీలక డిమాండ్ కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా. శనివారం కూడా సీజేపీ ఆ డిమాండ్‌ను పునరుద్ఘాటించింది. మధ్యాహ్నం లోగా ఆయన రాజీనామా చేయకపోతే, చర్చల వల్ల ఫలితమేమీ ఉండదని స్పష్టం చేసింది. దీంతో దేశవ్యాప్తంగా ఉవ్వెత్తున్న సాగుతున్న ఈ ఉద్యమానికి దిగొచ్చిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శనివారం తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి తన రాజీనామా లేఖను పంపినట్లు ఎక్స్ (ట్విట్టర్) వేదికగా వెల్లడించారు. లేఖ ద్వారా ఆయన పరీక్షల నిర్వహణ, ఆ తర్వాత చోటుచేసుకున్న పరిణామాలు, రాజీనామా నిర్ణయానికి దారితీసిన పరిస్థితులను దేశ ప్రజలకు సుదీర్ఘంగా వివరించారు. తొలి రోజు నుంచే ఈ ఘటనకు తానే పూర్తి బాధ్యత వహించానని, పరీక్షల మాఫియా కారణంగా ఏ ఒక్క ప్రతిభావంతుడైన విద్యార్థి భవిష్యత్తు పాడవకుండా చూసేందుకు కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న ఆందోళనలు, గత 10 రోజులుగా దేశంలో నెలకొన్న పరిస్థితులపై ధర్మేంద్ర ప్రధాన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఆందోళన పరిస్థితులను దేశ వ్యతిరేక శక్తులు తమ స్వార్థానికి వాడుకోకూడదని, దేశ ఐక్యత దెబ్బతినకూడదనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ప్రధాన్ రాజీనామా ప్రకటన వెలువడిన వెంటనే, జంతర్ మంతర్ వద్ద ఉన్న సీపీఐ(ఎం) రాజ్యసభ సభ్యుడు జాన్ బ్రిట్టాస్‌ను అభిజిత్ దీప్కే ఆలింగనం చేసుకున్నారు. ఆదివారం నాడు ఎస్ఎఫ్ఐ దేశవ్యాప్తంగా విజయ దినోత్సవ వేడుకలు నిర్వహించనుంది.

### చర్చలు సఫలం...ఆందోళన విరమణ

సీజేపీ ప్రతిపాదించిన మూడు ప్రధాన డిమాండ్లకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. దీంతో కేంద్ర ప్రభుత్వం, సీజే ప్రతినిధుల మధ్య జరిగిన చర్చలు సఫలం అయ్యాయి. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం శనివారం సాయంత్రం కాన్స్టిట్యూషన్ క్లబ్‌లో కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్, సీజేపీ ప్రతినిధులు సౌరవ్ దాస్, అశుతోష్ రంకా మధ్య మూడో దశ చర్చలు జరిగాయి. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రులు, సీజేపీ ప్రతినిధులు మాట్లాడారు. సీజేపీ ప్రతినిధి అశుతోష్ రంకా మాట్లాడుతూ 'ప్రభుత్వ ప్రతినిధులతో మూడు రౌండ్ల చర్చలు జరిపాం. మూడు ప్రధాన డిమాండ్లతలో మేము జంతర్ మంతర్ వద్ద గత కొన్ని రోజులుగా నిరసన చేపట్టాం. వీటిలో మొదటిది.. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి. నిరసనకారులు, సీజేపీ నేతలపై ఢిల్లీ, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పోలీసులు పెట్టిన కేసులు, ఎఫ్ఐఆర్‌లను విరమించుకోవాలి. అంతేకాదు.. భవిష్యత్తులో నీట్ నిరసనకారులపై ఎలాంటి కేసులు పెట్టొద్దు. అలానే నీట్ పరీక్ష రద్దుతో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు రూ.1 కోటి పరిహారం చెల్లించాలి.

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంతో మా మొదటి డిమాండ్ నెరవేరింది. మిగతా డిమాండ్లపై ప్రభుత్వం హామీ ఇచ్చారు' అని అన్నారు. సీజేపీ ప్రతినిధులు తమ ఆందోళనను విరమిస్తున్నామని ప్రకటించారు. జంతర్‌మంతర్ నుంచి విద్యార్థులు, యువత తిరిగి వెళ్లాలని కోరారు. తాము ఆశించిన చర్యలను కేంద్రం త్వరిత గతిన తీసుకుంటుందన్న విశ్వాసంతో ఆందోళనను విరమిస్తున్నామని అన్నారు. పరీక్షల సంస్కరణలకు సంబంధించి సీజేపీ ప్రతిపాదించిన ఐదు అంశాల అజెండాను ప్రభుత్వం పరిశీలిస్తుందని, ఈ సంస్కరణలపై మరింత చర్చించేందుకు సీజేపీ ప్రతినిధులు ప్రభుత్వంతో సమావేశం అవుతారని చెప్పారు. కేంద్ర మంత్రి జేపీ నడ్డా మాట్లాడుతూ "మీరు మా ముందు ఉంచిన డిమాండ్లపై, విద్యా వ్యవస్థలో సూచించిన సంస్కరణలపై మేము అధ్యయనం చేస్తాం. మీ పార్టీకి చెందిన మరికొందరు ప్రతినిధులతో కూడా చర్చలు జరుపుతాం. అలానే.. నష్టపరిహారంపై నిబంధనలకు లోబడి నిర్ణయం తీసుకుంటాం" అని పేర్కొన్నారు.

### యువత సాధించిన విజయం: సోనమ్ వాంగ్‌చుక్



కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ హర్షం వ్యక్తం చేశారు. ఇది పట్టుదలతో యువత సాధించిన విజయమని పేర్కొన్నారు. జెన్-జి, సీజేపీ ప్రతినిధులకు అభినందనలు తెలియజేశారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో శనివారం ఓ పోస్టు పెట్టారు. 'ఇది ప్రజాస్వామ్యం సాధించిన విజయం. ఇది శాంతి, ఓర్పు, నిరంతర పట్టుదలల విజయం. దేశంలోని సీజేపీ, జెన్-జీ యువతకు అభినందనలు. భయాన్ని వీడి దేశం నలుమూలల నుంచి పోరాటానికి కదలివచ్చిన పౌరులందరికీ ధన్యవాదాలు. ఇప్పటివరకు బాధ్యతాయుతమైన సమాధానం కోరాం. ఇకపై సంస్కరణల వైపు సాగుదాం' అని పేర్కొన్నారు.

### మార్పు తీసుకొచ్చే కొత్త శకం ఉదయిస్తుంది : అఖిలేష్ యాదవ్



లక్నో: కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను స్వాగతిస్తూ సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ దీన్ని "నైతిక విజయం, ఐక్యతకు నిదర్శనం"గా అభివర్ణించారు. ప్రతి కార్యకర్తకు, ప్రతి ఒక్కరికీ తన హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. పరీక్షలు, విద్యా వ్యవస్థ కోసం సాగించిన పోరాటంలో యువత సాధించిన ఈ విజయంతో ప్రారంభమైన ఉద్యమం రానున్న రోజుల్లో మరిన్ని విస్తృత మార్పులకు దారితీస్తుందని అఖిలేష్ యాదవ్ తన సామాజిక మాధ్యమ పోస్టులో పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని చేతబూని ఇవిఎం, ఎన్నికల సంస్కరణల వరకు ఈ ఉద్యమం విస్తరిస్తుందని, బిజెపి ఎన్నికల కుంభకోణాలు, ఎంపిలు-ఎమ్మెల్యేల కొనుగోళ్ల వంటి ప్రతికూల రాజకీయాలకు తెరపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. కమీషన్ల ద్వారా సాగే బిజెపి అవినీతి బట్టబయలవుతుందని, అధికార పక్షంతో కుమ్మక్కైన మీడియా 'హ్యాండౌట్లు, పొగడ్తల పాటల' సంబంధాలకు ముగింపు పలుకుతుందని పేర్కొన్నారు. బాధితులు, హింసకు గురైనవారు, అవమానానికి గురైనవారిపై ఇకపై బుల్డోజర్లు నడవవని, నిర్దోషులపై ఎన్‌కౌంటర్లు జరగవని ఆయన తెలిపారు. "ఇప్పుడు మార్పు తీసుకొచ్చే కొత్త శకం ఉదయిస్తుంది!" అని అఖిలేష్ యాదవ్ తన పోస్టులో తెలిపారు.

### విద్యార్థి, యువజనులకు అభినందనలు : సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో

జవాబుదారీతనం కోసం పోరాడి గెలిచిన విద్యార్థులకు,యువతకు భారత కమ్యూనిస్టు పార్టీ(మార్క్సిస్ట్) పొలిట్‌బ్యూరో అభినందనలు తెలిపింది. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. పేపర్ లీక్‌ల కారణంగా 22 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్న దురదృష్టకర సంఘటనలపై జవాబుదారీతనం కోసం పోరాడిన దేశంలోని విద్యార్థులు, యువతకు అభినందనలు తెలియజేసింది. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సాగిన లాఠీచార్జీలు, ఇతర అణచివేత చర్యలను ఎదుర్కొని కూడా వెనక్కి తగ్గకుండా, దేశ యువత ప్రదర్శించిన స్థిరమైన సంకల్పం, త్యాగాలు లేకపోతే ఈ విజయం సాధ్యమయ్యేది కాదు. యువత చూపిన ధైర్యం, దృఢ సంకల్పం భారత ప్రజాస్వామ్యానికి శుభసూచకం అని పొలిట్‌బ్యూరో పేర్కొంది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను సిపిఎం స్వాగతించింది. అయితే దీని తర్వాత కూడా పేపర్ లీక్ అయ్యే అవకాశముందని, దీనికి ప్రధానంగా బాధ్యత వహించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేయాలని డిమాండ్ చేసింది. పరీక్షల వికేంద్రీకరణ చేయాలని సిపిఎం ప్రకటనలో పునరుద్ఘాటించింది. అలాగే, వాణిజ్యీకరణ, కేంద్రీకరణ, మతతత్వం ప్రధానంగా ఉన్న జాతీయ విద్యా విధానం-2020ని కూడా రద్దు చేయాలి. ఈ చర్యలు తీసుకోకపోతే, పేపర్ లీక్‌లు, వంచనల పరంపర కొనసాగుతుందని తెలిపింది. విద్యార్థి,యువజన ఉద్యమాలు తమ భవిష్యత్తు కోసం ఈ ప్రధానమైన డిమాండ్లను ప్రచారం చేసి, ఆందోళన చేస్తారని ఆశిస్తున్నామని సిపిఎం తెలిపింది.

### ఓపెన్ సోర్స్‌పై మోడీ సర్కార్ అక్కసు
### బిట్‌చాట్‌పై గుట్టుచప్పుడుగా నిషేధం
### తీవ్రంగా ఖండించిన సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో


బహుళ జాతి కార్పోరేట్ సంస్థలైన ఫేస్‌బుక్, వాట్సాప్, గూగుల్ వంటి అధిపతులతో చెట్టాపట్టాలేసుకొని తిరుగుతున్న కేంద్ర ప్రభుత్వం ప్రజలందరికీ అందుబాటులో ఉండే సామాజిక మాధ్యమాల స్వేచ్ఛను హరిస్తోంది. ఓపెన్ సోర్స్ పై అక్కసు వెళ్లగక్కుతోంది. ఈ క్రమంలోనే ఓపెన్ సోర్స్ మేసేజింగ్ అప్లికేషన్ బిట్‌చాట్ సంస్థపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిషేదం విధించింది. అయితే ఈ నిషేదం విధిస్తున్నట్లుగా బహిరంగంగా ప్రకటించకుండా గుట్టుచప్పుడుగా కేవలం ఆ సంస్థకు మాత్రమే తెలియజేసి భారత్‌లో మూసివేసింది. ఇది అప్రజాస్వామిక చర్య అని సీపీఎం పొలిట్‌బ్యూరో ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. కేంద్ర ప్రభుత్వ చర్య ప్రజాస్వామ్య హక్కులు, భావప్రకటనా స్వేచ్ఛ, శాంతియుతంగా సంఘటితమై సంభాషించుకునే ప్రజల హక్కుపై చేస్తున్న దాడిగా పేర్కొంది. ఈ నిషేధం గురించి కేంద్ర ప్రభుత్వం ఎలాంటి అధికారిక ప్రకటన, ఉత్తర్వు గానీ జారీ చేయకపోవడం మరింత ఆందోళనకరమని తెలిపింది. బిట్‌చాట్‌ను అభివృద్ధి చేసిన బృందానికి చెందిన జాక్ డోర్సీ సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తే కానీ..ఈ నిషేదం సంగతి బహిర్గతం కాలేదని తెలిపింది. పారదర్శకత లేదా ప్రజా జవాబుదారీతనం లేకుండా రహస్యంగా చేసిన ఈ నిషేధ నిర్ణయం రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్య నియమాలకు పూర్తిగా విరుద్ధమని పొలిట్ బ్యూరో ఖండించింది.

కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ జారీ చేసిన ఉత్తర్వుల్లో తక్షణమే యాక్సెస్‌ను నిలిపివేయాలని ఆదేశించడమే కాకుండా, ఆ ప్లాట్‌ఫామ్‌పై శిక్షాత్మక పరిణామాలు ఉంటాయని హెచ్చరించారని పొలిట్‌బ్యూరో వెల్లడించింది. నిజానికి కేంద్ర ప్రభుత్వ అభ్యంతరం చట్టవిరుద్ధమైన కంటెంట్‌పై కాదని...దాని అభ్యంతరమంతా ఇంటర్నెట్ ఆంక్షలు విధించిన సమయంలోనూ బిట్‌ఛాట్ పనిచేయడంపైనే అని విమర్శించింది. అందుకనే ఆ సంస్థ గొంతు నులిమేశారని వ్యాఖ్యానించింది. ప్రభుత్వం ఇంటర్నెట్ సేవలను నిలిపివేసినప్పుడల్లా, పౌరులకు బిట్‌ఛాట్ వంటి ఓపెన్ సోర్స్ వేదికలు సందేశాలు పంపుకోవడానికి వీలుకల్పిస్తున్నాయని, మోడీ సర్కార్‌కు కంటగింపుగా మారింది ఇదేనని పేర్కొంది. జంతర్‌మంతర్ వద్ద విద్యార్థుల ఆందోళన ఒక వైపు కొనసాగుతుండగా అంతులేని ఆంక్షలు విధించిన మోడీ సర్కార్ ఇంటర్నెట్ కూడా నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బిట్‌ఛాట్ లాంటి సంస్థలను విద్యార్థులు వినియోగించుకునే వెసులుబాటు లేకుండా చేయాలని దానిపై నిషేధం విధించినట్లుగా కనిపిస్తోందని సీపీఎం పొలిట్‌బ్యూరో తెలిపింది.

పారదర్శకత లేదా సరైన ప్రక్రియ లేకుండా, ఓపెన్-సోర్స్ సాఫ్ట్‌వేర్‌ను నిరోధించడానికి అస్పష్టమైన కార్యనిర్వాహక ఉత్తర్వులను జారీ చేయడం రాజ్యాంగ సూత్రాలను ఉల్లంఘించడమే కాకుండా, చట్టబద్ధ పాలనను మరింతగా బలహీనపరుస్తుందని తెలిపింది. బిట్‌చాట్‌ను నిషేధిస్తూ జారీ చేసిన ఉత్తర్వును తక్షణమే ఉపసంహరించుకోవాలని, ఏకపక్షంగా నిలిపివేసిన చోటల్లా నిరంతరాయ ఇంటర్నెట్ కనెక్టివిటీని పునరుద్ధరించాలని, ఇలాంటి నిషేధం, ఇంటర్నెట్ షట్‌డౌన్ ఉత్తర్వులన్నింటినీ బహిరంగపర్చాలని, శాంతియుత నిరసన తెలిపే తమ ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకుంటున్న విద్యార్థులు, యువతపై జరుగుతున్న వ్యవస్థీకృత అణచివేతకు ముగింపు పలకాలని పొలిట్ బ్యూరో ఆ ప్రకటనలో డిమాండ్ చేసింది. ఈ నిరంకుశ చర్యలను ప్రతిఘటిస్తున్న విద్యార్థులు, యువత, అన్ని ప్రజాస్వామ్య శక్తులకు సిపిఎం అండగా నిలుస్తుందని పొలిట్‌బ్యూరో స్పష్టం చేసింది. రాజ్యాంగం హామీ ఇచ్చిన ప్రాథమిక ప్రజాస్వామ్య హక్కులను హరించే అధికారం ఏ ప్రభుత్వానికీ లేదని పొలిట్‌బ్యూరో పేర్కొంది.

## మోదీ ప్రభుత్వ అహంకారం ఓడింది

**ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే**



దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్-యూజీ ప్రశ్నాపత్రం లీకేజీ వివాదంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. విద్యార్థుల నుంచి వెల్లువెత్తిన తీవ్ర నిరసనలు, విపక్షాల ఒత్తిడి నడుమ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శనివారం తన పదవికి రాజీనామా చేశారు. ఈ పరిణామంపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పందించారు. దేశంలోని విద్యార్థుల గొంతుక ఎట్టకేలకు అహంకారపూరిత ప్రభుత్వ గడపను తాకిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యానించారు. విద్యావ్యవస్థ ప్రక్షాళనను కోరుతూ దేశవ్యాప్తంగా వీధుల్లోకి వచ్చి గళమెత్తిన లక్షలాది మంది యువత సాధించిన విజయమిదని ఆయన 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. "ఇది సత్యానికి లభించిన విజయం. ప్రధాని మోదీ మొండివైఖరికి దక్కిన ఓటమి. అవినీతిమయమైన ఈ ప్రభుత్వం కారణంగా నష్టపోయిన కుటుంబాలందరిదీ ఈ విజయం" అని ఖర్గే అభివర్ణించారు. విద్యార్థుల ప్రయోజనాల పరిరక్షణ కోసం పార్లమెంటు నుంచి వీధుల వరకు ఏకతాటిపై నిలిచి పోరాడిన ప్రతిపక్షాల ఐక్యతే ఈ విజయానికి కారణమని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ యువతరానికి క్షమాపణ చెప్పాలని ఖర్గే డిమాండ్ చేశారు. నిరసనలు తెలుపుతున్న విద్యార్థులపై లాఠీచార్జి చేసి, దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## ప్రజాస్వామ్యం గెలిచింది

(మొదటిపేజీ తరువాయి)

అవసరం లేదని చెప్పారు. పాలకులను అదుపులో ఉంచాల్సిన అవసరం ఉందన్నారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా... ప్రజాస్వామ్యం, విద్యార్థులు సాధించిన విజయంగా పేర్కొన్నారు. నీట్ పేపర్ లీక్ వివాదంపై కొన్ని వారాలుగా కొనసాగిన నిరసనల ఫలితంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకునేలా విద్యార్థులు ఒత్తిడి తెచ్చారని అన్నారు. ప్రజాస్వామ్య విలువలకు, దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థుల సామూహిక సంకల్పానికి లభించిన విజయమని ఆయన అభివర్ణించారు. నిరంతర శాంతియుత నిరసనలు మార్పును తీసుకురాగలవని చెప్పడానికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ఒక నిదర్శనమని అభిజీత్ దిప్కే తెలిపారు. 'ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. మీరు భయపడకపోతే, ఈ ప్రభుత్వం తలొగ్గకపోతే, మనం ఎవరితోనైనా రాజీనామా చేయించగలమని చెప్పడానికి ఇది నిదర్శనం' అని అన్నారు. అలాగే నీట్ పేపర్ లీక్ వివాదం తరువాత ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల పేర్లను దీప్కే గుర్తు చేసుకున్నారు. వారి స్మృతి కోసం రెండు నిమిషాల పాటు మౌనం పాటించాలని నిరసనకారులను కోరారు. అనంతరం ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై నిరసన ప్రాంగణంలో విద్యార్థుల సంబరాలు హోరెత్తాయి.

## విద్యార్థుల పోరాటానికి సెల్యూట్..

(మొదటిపేజీ తరువాయి)

తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఓ వీడియో సందేశం ద్వారా స్పందించారు. దేశవ్యాప్తంగా నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై ఆందోళనలు నిర్వహించిన విద్యార్థులను అభినందించారు. "ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా భారత విద్యా వ్యవస్థను పునర్నిర్మించే దిశగా ఒక పెద్ద అడుగు. దేశవ్యాప్తంగా పోరాడిన ప్రతి విద్యార్థికి అభినందనలు. మిమ్మల్ని చూసి గర్విస్తున్నాం" అని ఆయన అన్నారు.

### ప్రజాస్వామ్యాన్ని కాపాడింది విద్యార్థులే

విద్యార్థుల పట్టుదల వల్లే దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, అలాగే వారి భవిష్యత్తు రక్షించబడిందని రాహుల్ గాంధీ తెలిపారు. నీట్ ప్రశ్నపత్రం లీక్‌పై విద్యార్థులు నిర్వహించిన ఉద్యమం దేశానికి ఒక గొప్ప సందేశం ఇచ్చిందని ఆయన అభిప్రాయపడ్డారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో ఒక డిమాండ్ నెరవేరి నప్పటికీ.. ఇంకా రెండు కీలక అంశాలు మిగిలి ఉన్నా యని రాహుల్ గాంధీ అన్నారు. దేశ యువత పట్ల గౌరవం చూపుతూ ప్రధాని మోడీ విద్యార్థులకు బహిరం గంగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

### ఇతర వర్గాలు కూడా హక్కుల కోసం పోరాడాలి

దేశంలోని రైతులు, కార్మికులు, పేదలు, అలాగే ప్రభుత్వం అణచివేస్తోందని భావిస్తున్న ఇతర వర్గాల ప్రజలు కూడా రాజ్యాంగబద్ధ మార్గంలో తమ హక్కుల కోసం పోరాడాలని రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. "గౌరవం కోసం, హక్కుల కోసం రాజ్యాంగబద్ధంగా నిలబడటమే నిజమైన ధైర్యం" అని ఆయన వివరించారు. కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన రాహుల్ గాంధీ.. ఇప్పుడు ఈ ప్రభుత్వాన్ని తొలగించాల్సిన సమయం వచ్చిందనీ, భయపడొద్దని అన్నారు.

## ఇది యువత సాధించిన విజయం:

**- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై ప్రియాంక గాంధీ**



నీట్-యూజీ పరీక్షల అవకతవకల వివాదం నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా హర్షం వ్యక్తం చేశారు. ఇది దేశ యువత సాధించిన విజయమని, వారి గొంతును ఎవరూ, ఎప్పటికీ అణచివేయలేరని ఆమె స్పష్టం చేశారు. శనివారం తన లోక్‌సభ నియోజకవర్గమైన కేరళలోని వయనాడ్‌లో విలేకరులతో మాట్లాడిన ప్రియాంక గాంధీ, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా వార్త తనను కొంత భావోద్వేగానికి గురిచేసిందని తెలిపారు. "గత పది, పన్నెండేళ్లుగా మన యువత ఎప్పుడు చైతన్యవంతమవుతుందా అని నేను అనేకసార్లు నన్ను నేను ప్రశ్నించుకున్నాను. నేడు దేశ యువత గళం విప్పింది, వారి గొంతు వినిపించింది. ఇది ఎంతో సంతోషకరమైన విషయం" అని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వం తీరుపై విమర్శలు గుప్పిస్తూ, "ఆర్ఎస్ఎస్ తన భావజాలంతో మొత్తం విద్యా వ్యవస్థను నింపేస్తోంది. మన పూర్వీకుల సిద్ధాంతాలను ప్రణాళికాబద్ధంగా నాశనం చేస్తున్నారు. నిరసన తెలిపిన వారిపై అధికార బలాన్ని ప్రయోగించారు. అయితే, ప్రజలే అత్యంత శక్తివంతులని ప్రతి పాలకుడూ ఈ ఘటన ద్వారా గుణపాఠం నేర్చుకోవాలి. ఈ రోజు మన దేశాన్ని మనం తిరిగి నిలబెట్టుకుంటున్నాం" అని ఆమె వ్యాఖ్యానించారు. నీట్-యూజీ పేపర్ లీక్ ఆరోపణలపై దేశవ్యాప్తంగా విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టిన విషయం తెలిసిందే. కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ), పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్ మద్దతుతో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసనలు ఉధృతంగా జరిగాయి. కేంద్ర మంత్రి రాజీనామా చేయాలన్నది వారి ప్రధాన డిమాండ్‌గా ఉంది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను ప్రజాస్వామ్య విజయంగా సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, సోనమ్ వాంగ్‌చుక్ అభివర్ణించారు.

## మోకాళ్లపై నిలబెట్టారు

**- ప్రకాశ్‌రాజ్ సీజేపీకి అభినందనలు**



ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు ప్రజలకు ఉందనే విషయాన్ని ఈ పోరాటం నిరూపించిందనీ, నిరంకుశ పాలనను సైతం మీరు మోకాళ్లపైకి తీసుకురాగలరని నిరూపించారు." అని సినీనటుడు ప్రకాశ్‌రాజ్ పేర్కొన్నారు. తనదైన శైలిలో నిలదీస్తూ, ప్రశ్నించేతత్వం తో ముందుకు సాగే ప్రకాష్ రాజ్ తాజాగా న్యూఢిల్లీలో యువత సాధించిన విజయంపై ఎక్స్ వేదికగా స్పందించారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సోనమ్ వాంగ్‌చుక్ నేతృత్వంలో సాగిన పోరాటా న్ని, దానికి మద్దతుగా నిలిచిన యువతకు ఆయన అభినందనలు తెలియజేశారు. "నా ప్రియమైన 'కాక్రోచ్' (బొద్దింకలు) కి నా అభినందనలు.. ప్రియమైన సోనమ్ వాంగ్‌చుక్ కు , యువత పక్షాన నిలబడిన ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు. నిరంకుశ పాలనను సైతం మీరు మోకాళ్లపైకి తెప్పించగలరని నిరూపించారు." అని పేర్కొన్నారు. ప్రకాష్ రాజ్ చేసిన ఈ పోస్ట్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది

# సంపాదకీయం

## విద్యావ్యవస్థలో సంస్కరణలు అవసరం




“ఒక దేశ నాశనానికి అణుబాంబులు కానీ, సుదూర క్షిపణులు కానీ అవసరం లేదు. విద్యా వ్యవస్థ ప్రమాణాలను తగ్గించి, విద్యార్థులను పరీక్షల్లో మోసం చేయడానికి అనుమతిస్తే చాలు.. ఆ దేశం తనంతట తానే కూలిపోతుంది.”దక్షిణాఫ్రికాలోని ఒక ప్రముఖ విశ్వవిద్యాలయ ప్రవేశ ద్వారం వద్ద పెద్ద అక్షరాలతో ఊ సత్యం రాసి ఉంటారు. సరిగ్గా ఈ కొటేషన్ మన దేశంలో నేడు చోటుచేసుకుంటున్న పరంపరలకు అద్దం పడుతోంది. దొరికినవాడే దొంగ.. దొరకనంత వరకు అందరూ దొరలే అన్నట్లుగా తయారైంది మన దేశంలోని పోటీ పరీక్షల తీరు. నీట్ ప్రవేశ పరీక్ష పేపర్ లీకేజీ ఉదంతం దేశవ్యాప్తంగా లక్షల మంది విద్యార్థులలో, వారి తల్లిదండ్రులలో సృష్టించిన ఆగ్రహజ్వాలలు ఇంకా చల్లారలేదు. ప్రశ్నాపత్రం లీక్ అయిందని ఆధారాలతో సహా రుజువు కావడంతో దిద్దుబాటు చర్యల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం పరీక్షను రద్దు చేసి, తీవ్ర నిరసనల మధ్య మళ్లీ నిర్వహించింది. అంతవరకు బాగానే ఉంది. కానీ, ఇక్కడ అసలైన ప్రశ్న ఏమిటంటే ఈసారి దొరికింది కాబట్టి లీకేజీ బయటపడింది; మరి దొరకకుండా వెనుక తలకాయలు నడిపిన ముఠాలు, గతంలో జరిగిన పరీక్షల్లో ఎంతటి అక్రమాలకు పాల్పడి ఉంటాయి? భవిష్యత్తులో ఇవి మళ్లీ జరగవని గ్యారెంటీ ఏమిటి?మన విద్యా వ్యవస్థలో పేపర్ లీకేజీలు అనేవి ఒక సాధారణ రుగ్మత గా మారిపోవడం సమగ్ర ప్రజాస్వామ్యానికే పెను ప్రమాద ఘంటిక. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన అత్యున్నత వైద్య విద్యా ప్రవేశ పరీక్ష నీట్ లో చోటుచేసుకున్న అవకతవకలు బయటపడటంతో కేంద్ర ప్రభుత్వం తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. కేసు విచారణను సిబిఐ కి అప్పగించడం, దర్యాప్తు సంస్థలు బీహార్, గుజరాత్ సహా పలు రాష్ట్రాల్లో నిందితులను అరెస్ట్ చేయడం, ముఠాల గుట్టు రట్టు చేయడం చరచరా జరిగాయి. హైటెక్ పద్ధతుల్లో వాట్సాప్ గ్రూపులు, సేఫ్ హౌస్‌లలో విద్యార్థులకు సమాధానాలు బట్టీ పట్టించడం వంటి ఘోరాలు వెలుగు చూశాయి. దేశంలో యువతరం రోడ్లపైకి వచ్చింది. లీకేజీల వ్యవస్థపై అసహనం శృతిమించి కాక్రోచ్ పేరుతో సరికొత్త నిరసన ఉద్యమాలు రూపుదిద్దుకున్నాయి. లీకేజీలు, వ్యవస్థాగత లోపాల వల్ల తమ భవిష్యత్తు చీకటిమయమవుతోందన్న ఆవేదన, ఆగ్రహం యువతలో ఏ స్థాయిలో ఉందో ఈ నిరసనల ఉద్ధృతి స్పష్టం చేస్తోంది.మన దేశ పారదర్శకతకు పేపర్ లీకేజీలు కొత్తేమీ కావు. దశాబ్దాల చరిత్రను తిరగేస్తే, ప్రతిష్ఠాత్మక కేంద్ర, రాష్ట్ర స్థాయి పరీక్షల్లో ఎన్నో సార్లు లీకేజీ ఘటనలు వెలుగు చూశాయి. బయటపడి, రగడ తీవ్రమైనప్పుడు మాత్రమే ప్రభుత్వాలు రద్దు నిర్ణయాలు తీసుకున్నాయి. సమాజం దృష్టికి రాని, ఆధారాలు దొరకని ఎన్నో సందర్భాల్లో అక్రమార్కులు అత్యున్నత ర్యాంకులు పొంది వ్యవస్థలోకి ప్రవేశించి ఉంటారనడంలో ఎలాంటి సందేహమూ లేదు. దీనివల్ల రాత్రింబవళ్లు కష్టపడి చదివిన నిజమైన ప్రతిభావంతులు, నిరుపేద విద్యార్థులు శాశ్వతంగా తమ అవకాశాలను కోల్పోయారు. గతంలో జరిగిన నష్టాన్ని ఇప్పుడు పునరుద్ధరించలేకపోవచ్చు, కానీ భవిష్యత్తు తరాల భవితవ్యాన్ని రక్షించడానికి శాశ్వత, కఠిన కట్టడి చర్యలు వంద శాతం అవసరం. ఎప్పటికప్పుడు తాత్కాలిక ఉపశమానాలు లేదా చిన్నచిన్న కమిటీలతో సరిపెడుతున్న పాలకులు, ఈ వ్యవస్థాగత చీడను తుడిచిపెట్టే శాశ్వత పరిష్కారాల వైపు అడుగులు వేయకపోవడమే అసలు విషాదం. పేపర్ లీకేజీల మహమ్మారి కేంద్ర పరిధిలోని పరీక్షలకే పరిమితం కాలేదు. తెలుగు రాష్ట్రాల్లో వైఫల్యాలు అనేకమంది అభ్యర్థుల జీవితాలను బుగ్గిపాలు చేశాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుంచి ఎంసెట్ లీకేజీలు పదే పదే కలకలం రేపాయి. ముఖ్యంగా 2016 లో తెలంగాణలో జరిగిన ఎంసెట్-2 మెడికల్ పేపర్ లీకేజీ ఘటన దేశాన్నిగ్భ్రాంతికి గురిచేసింది. ఆల్ ఇండియా స్థాయిలో నెట్‌వర్క్ నడిపి, కోట్ల రూపాయలు వసూలు చేసి ప్రింటింగ్ ప్రెస్ స్థాయి నుంచే పేపర్ లీక్ చేశారు. దీంతో లక్షలాది మంది విద్యార్థులు మళ్లీ పరీక్ష రాయాల్సి వచ్చింది. హైదరాబాద్ కేంద్రంగా రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయంలోనే కంప్యూటర్లు హ్యాక్ చేసి, అంతర్గత సిబ్బంది ద్వారా గ్రూప్-1 ప్రిలిమ్స్, అసిస్టెంట్ ఇంజనీర్ పరీక్షల పేపర్లు లీక్ కావడం అత్యంత భయంకరమైన ఉదంతం. ఏళ్ల తరబడి కోచింగ్ సెంటర్లలో మగ్గిపోయిన నిరుద్యోగ యువత రోడ్లెక్కి ఉద్యమించాల్సి వచ్చింది. ఈ లీకేజీల ఫలితంగా పదే పదే పరీక్షలను రద్దు చేసి మళ్లీ నిర్వహించాల్సిన దుస్థితి ఏర్పడింది. తరచూ టెన్త్ క్లాస్ బోర్డు పరీక్షల ప్రశ్నాపత్రాలు పరీక్ష ప్రారంభమైన కొద్ది నిమిషాల్లోనే వాట్సాప్ గ్రూపుల్లో ప్రత్యక్షం కావడం, ఉపాధ్యాయులు, కార్పొరేట్ విద్యాసంస్థల ప్రతినిధులు అరెస్ట్ కావడం మనం చూస్తూనే ఉన్నాం. మరోవైపు, ఒకే దేశం ? ఒకే పరీక్ష అనే అతిగా కేంద్రీకృతమైన నినాదం కూడా తీవ్రమైన సమస్యలను తెచ్చిపెడుతోంది. భారత్ లాంటి విభిన్నమైన, విశాలమైన దేశంలో కోట్లాది మందికి ఒకే ఏజెన్సీ ద్వారా ప్రవేశ పరీక్షలను నిర్వహించాలనుకోవడం పరిపాలనాపరంగా అత్యంత ప్రమాదకరమైన ప్రయోగం. దేశంలో ఎక్కడో ఒక మూలన ఉన్న పరీక్షా కేంద్రంలో చిన్న లోపం జరిగినా, లేదా ఒక డిజిటల్ నెట్‌వర్క్ హ్యాక్ అయి పేపర్ బయటకు వచ్చినా.. దేశవ్యాప్తంగా ఉన్న 20 నుండి 25 లక్షల మంది విద్యార్థుల శ్రమ బూడిదలో పోసిన పన్నీరవుతుంది. అంతేకాకుండా, రాష్ట్రాల విద్యా బోర్డుల స్వయంప్రతిపత్తి దెబ్బతిని, ప్రాంతీయ వ్యత్యాసాలు ఉన్న విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది.ప్రజాస్వామ్యంలో నిరసన అనేది రాజ్యాంగం కల్పించిన హక్కు. అది ప్రభుత్వాల కళ్లు తెరిపించడానికి, వ్యవస్థాగత సంస్కరణలు సాధించడానికి ఉపయోగపడాలి. కానీ, ఆ నిరసనలు ప్రజా ఆస్తుల విధ్వంసానికి, హింసకు దారితీస్తే అది అరాచకత్వానికి దారితీసి, అసలు ఆశయానికే విఘాతం కలిగిస్తుంది.ప్రస్తుతం యువత జరుపుతున్న కాక్రోచ్ ఆందోళనలను , నీట్ నిరసనలను ప్రతిపక్షాలు ప్రత్యేకించి కాంగ్రెస్ వంటి పార్టీలు పూర్తిగా తమ రాజకీయ లబ్ధి కోసం హైజాక్ చేయడానికి ప్రయత్నిస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి. ఇది ఉద్యమ స్వభావాన్ని రాజకీయం గా మార్చేస్తోంది. గతంలో కాంగ్రెస్ సుదీర్ఘ పాలన కాలంలో ఏ రకమైన అవినీతి, వ్యూహాత్మక లోపాలు, ప్రశ్నాపత్రాల కుంభకోణాలు జరిగాయో దేశంలో మధ్య వయస్సులో ఉన్న ప్రతి పౌరుడికీ స్పష్టంగా తెలుసు. నాటి యూపీఏ హయాంలో వెలుగుచూసిన దారుణాలు దేశం ఇంకా మరచిపోలేదు.హింసకు, రాజకీయ హైజాకింగ్‌లకు తావివ్వకుండా, ప్రజాస్వామ్య గీత దాటకుండా సాగే వైజ్ఞానిక, చట్టబద్ధమైన పోరాటాలే ఎంతటి మొండి ప్రభుత్వాల మెడలనైనా వంచుతాయి. సమగ్రమైన, శాశ్వతమైన విద్యా సంస్కరణలకు తిరుగులేని బాటలు వేస్తాయి. రాజకీయనాయకుల స్వార్థానికి, అవినీతి ముఠాల అక్రమార్జనకు లక్షలాది మంది ప్రతిభావంతులైన విద్యార్థుల కన్నీళ్లు, నిరుద్యోగుల నిరాశ బలికాకూడదంటే ప్రతి ప్రశ్నా ప్రజాస్వామ్య ఆయుధంగా మారాలి.ప్రశ్నించే గొంతుకలకు స్పష్టమైన కార్యాచరణ తోడైనప్పుడే పాలకులు దిగివస్తారు. రాజకీయాల రంగు పడకుండా, చట్టసభలు చుట్టుముట్టేలా యువత తెచ్చే ఈ మేధో సంచలనమే రాబోయే రోజుల్లో వ్యవస్థలకు అసలైన దిశానిర్దేశం చేస్తుంది. పారదర్శకతకు పట్టంకడుతూ, పేపర్ లీకేజీలు లేని స్వచ్ఛమైన సమర్థ భారత్ ను నిర్మించుకోవడమే మన విద్యా వ్యవస్థకు, కష్టపడే ప్రతిభావంతులైన యువతకు మన సమాజం అందించే అత్యున్నతమైన, అసలైన గౌరవం!

# నీట్‌ను పట్టించుకోని తెలుగు ప్రాంతీయ పార్టీలు

**హైదరాబాద్ - సూర్య వాస్తవం**

దేశవ్యాప్తంగా నీట్ పేపర్ లీకేజీ, కేంద్ర ప్రభుత్వ విద్యారంగ విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసనలు మిన్నంటుతున్నా, తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన ప్రాంతీయ పార్టీలు బీఆర్ఎస్ , వైఎస్సార్‌సీపీ అనూహ్యంగా మౌనం వహించడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ పార్టీ , వివిధ విద్యార్థి సంఘాలు రోడ్లెక్కి ఆందోళనలు నిర్వహిస్తున్నప్పటికీ, ఈ రెండు ప్రాంతీయ పార్టీలు మాత్రం క్రియాశీలక పోరాటాలకు దూరంగా ఉంటున్నాయి. యువత , విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అత్యంత సున్నితమైన అంశంపై ఈ రెండు పార్టీల మౌనం రాజకీయంగా పలు అనుమానాలకు తావిస్తోంది.సాధారణంగా ప్రతిపక్షాలకు యువత, విద్యార్థి వర్గాల మద్దతును పొందేందుకు ఇలాంటి జాతీయ స్థాయి వివాదాలు ఒక పెద్ద ఆయుధంగా ఉపయోగపడతాయి. ముఖ్యంగా బీజేపీ వైఫల్యాలను ఎండగట్టేందుకు ప్రాంతీయ పార్టీలు ముందంజలో ఉండాలి. కానీ, తెలంగాణలో బీఆర్ఎస్, ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ రెండూ కూడా జాతీయ స్థాయిలో విపక్షాల కూటమి పిలుపునిచ్చిన నిరసనలకు భౌతికంగా, ఉధృతంగా మద్దతు తెలపకపోవడం వెనుక పెద్ద రాజకీయ వ్యూహంతో పాటు కేంద్రం పట్ల ఉన్న భయాందోళనలే కారణమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సందిగ్ధ పరిస్థితికి ప్రధాన కారణం కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ నాయకత్వం పట్ల ఈ పార్టీలకున్న వినూత్నమైన అభద్రత. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ గత లోక్‌సభ ఎన్నికల తర్వాత, అసెంబ్లీ ఓటమి అనంతరం తన




రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకు బీజేపీతో అనధికారికంగా ఒక వ్యూహాత్మక శాంతి ని పాటిస్తోందనే ఆరోపణలు ఉన్నాయి. కేంద్రాన్ని లేదా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులను నేరుగా టార్గెట్ చేస్తే టీఎంసీ లాంటి పరిస్థితులు రావొచ్చని సందేహిస్తున్నారు. అటు ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. ఏపీలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారంలో ఉంది. గత ఐదేళ్ల పాలనపై ప్రస్తుత కూటమి ప్రభుత్వం పలు విచారణలకు ఆదేశిస్తున్న తరుణంలో, కేంద్రంలోని బీజేపీ పెద్దల ఆగ్రహానికి గురైతే పార్టీ మరింత తీవ్రమైన పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ భావిస్తోంది. అందువల్లనే, కేంద్ర విద్యాశాఖ , మోదీ ప్రభుత్వాన్ని విమర్శించే విషయంలో వైఎస్సార్‌సీపీ చాలా అప్రమత్తంగా, పరిమిత వ్యాఖ్యలకే పరిమితమవుతూ, వీధుల్లోకి వచ్చి పోరాడేందుకు వెనుకాడుతోంది. విద్యార్థుల భవిష్యత్తు ఎటుపోయినా పర్వాలేదు కానీ, కేటీఆర్, బీఆర్ఎస్ నేతలు మాత్రం కేంద్రాన్ని ప్రశ్నించరు అంటూ రేవంత్ రెడ్డి టార్గెట్ చేస్తుండటంతో, బీఆర్ఎస్ డిఫెన్స్‌లో పడిపోతోంది. తమ స్వయంకృత అపరాధాల వల్ల వచ్చిన కేసుల భయంతోనే బీఆర్ఎస్ నోరు మెదపడం లేదని కాంగ్రెస్ విస్తృతంగా ప్రచారం చేస్తోంది. అందుకే మొక్కుబడిగా జంతర్, మంతర్ దగ్గర బీఆర్ఎస్వీతో నిరసనలు చేయిస్తామని ప్రకటించారు. సుదీర్ఘ కాలంలో ఈ తరహా మౌనం ప్రాంతీయ పార్టీలకు పెద్ద దెబ్బగా మారే అవకాశం ఉంది. రాబోయే కాలంలో నిరుద్యోగిత, విద్యార్థుల సమస్యలు, రిక్రూట్‌మెంట్లు ప్రధాన రాజకీయ అంశాలుగా మారబోతున్న తరుణంలో, యువతకు అండగా నిలవాల్సిన ప్రతిపక్షాలు వెనుకడుగు వేస్తున్నాయి. ఇది కాంగ్రెస్‌కు విద్యార్థి, యువజన ఓటు బ్యాంకును మరింత బదిలీ చేసేందుకు దోహదపడుతోంది. కేంద్రంలోని బీజేపీ అగ్రనాయకత్వం పట్ల ఉన్న భయం, రాజకీయంగా వ్యూహాత్మకంగా సైలెంట్‌గా ఉండాలనే నిర్ణయం వల్లనే బీఆర్ఎస్, వైఎస్సార్‌సీపీలు జాతీయ స్థాయి ఆందోళనలకు దూరంగా ఉంటున్నాయి. ఈ వ్యూహం ప్రస్తుతానికి తమపై కేంద్ర సంస్థల దాడులు పడకుండా కాపాడుకోవడానికి ఉపయోగపడవచ్చు ఏమో కానీ, క్షేత్రస్థాయిలో విద్యార్థులను, యువత మద్దతు కోల్పోయే ప్రమాదాన్ని ఈ ప్రాంతీయ పార్టీలు స్వయంగా తెచ్చిపెట్టుకుంటున్నాయని ఎక్కువ మంది భావిస్తున్నారు.

# 21 ఏండ్లకే యువత ఎంపీలు, ఎమ్మెల్యేలవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

నిర్ణయించారు. కానీ లోక్‌సభకు ?25 ఏండ్లు, రాజ్యసభకు 30 ఏండ్లు దాటితేగానీ ఎన్నిక కావడం లేదు. చట్టసభల్లో జెన్ జీ గ్రూపు వాళ్లు ?ఒక్క శాతం కూడా లేరు. జర్మనీ, యూకే లాంటి దేశాల్లో 18 ఏండ్లకే ఎంపీలు, ప్రధానమంత్రులయ్యే అవకాశముంది. అలా మన దగ్గర ఎందుకు కావొద్దు. చట్టసభల్లో పోటీచేసే వయస్సును 21 ఏండ్లకు కుదిస్తూ ఆగస్టు మొదటి వారంలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానించి కేంద్రానికి పంపుతాం’ అని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు. నీట్ ప్రశ్నా పత్రాల లీక్ కారణంగా ఆత్మహత్యలు చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ, జంతర్‌మంతర్‌లో విద్యార్థులపై లాఠీఛార్జికి నిరసనగా శనివారం టీపీసీసీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజా నుంచి నెక్లెస్ రోడ్డు వరకు కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీకి వేలాదిగా యువత తరలొచ్చింది. జెన్‌జీనుద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాజీవ్ గాంధీ తీసుకున్న నిర్ణయంతోనే నూనుగు మీసాల యువకులు, సోదరీమణులు ఓటు హక్కు పొందగలిగారని చెప్పారు. పీవీనరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థల్లో మేయర్లు, జడ్పీ చైర్మెన్ల వంటి పోస్టులకు ఎన్నికయ్యే వయస్సును 25 నుంచి 21 ఏండ్లకే తగ్గించారని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రధానమంత్రులు తీసుకున్న నిర్ణయంతోనే యువత 18 ఏండ్లకే ఓటు వేయగలుగుతున్నారనీ, 21 ఏండ్లకే స్థానిక సంస్థల్లో పదవులు సాధించగలుగుతున్నారని తెలిపారు. 21 ఏండ్లకే ఒక సోదరీమణి తిరువనంతపురం మేయర్‌గా ఎన్నికకావడానికి నాడు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన అవకాశమే కారణమన్నారు. లోక్‌సభలో 543 మంది ఎంపీలుంటే 30 శాతంగా ఉన్న జెన్‌జీకి ఒక్క శాతం లోపే ప్రాతినిధ్యం ఉందన్నారు. వారి సమస్యలు పరిష్కారం కావాలంటే చట్ట సభల్లోనూ వారి ప్రాతినిధ్యం పెరగాలని ఆకాంక్షించారు. దేశంలో అత్యున్నతమైన సివిల్ సర్వీసుకు 21 ఏండ్లకే ఎంపికయ్యే అవకాశం ఉందని చెబుతూ...21 ఏండ్లకే శ్రీలక్ష్మి, 22 ఏండ్లకే మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన అనన్య ఐఏఎస్‌లుగా, 22 ఏండ్లకే ప్రస్తుత డీజీపీ సి.వి.ఆనంద్ ఐపీఎస్‌గా ఎంపికైన విషయాన్ని గుర్తు చేశారు. జంతర్ మంతర్ నుంచి పార్లమెంట్ కు ప్రదర్శనగా వెళ్లడం కాదు... రోడ్లపై నుంచి నేరుగా పార్లమెంట్‌లోకి వెళ్లేలా యువత ఉండాలన్నారు. 21 ఏండ్లకే లోక్‌సభకు పోటీ చేసే అవకాశముంటే సభలోనే జెన్ జీ గళాన్ని వినిపించే అవకాశముంటుందన్నారు.

కేంద్రంలో రాహుల్ గాంధీ నేతృత్వంలో ఏర్పాటయ్యే ప్రభుత్వంలో విద్యా శాఖ జెన్ జీ నేతకు ఇస్తామనీ, దీనిపై రాహుల్ గాంధీని, ఇండియా కూటమి నేతలను ఒప్పిస్తానని హామీనిచ్చారు. విద్యా, ఐటీ వంటి కీలకమైన శాఖలను 60, 70, 90 ఏండ్లవారికి కాకుండా 21 ఏండ్ల వారికే ఇవ్వాలనీ, తమకేం కావాలో వారికే తెలుసని అన్నారు. జెన్ జీ పోరాట పటిమను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా ప్రశంసించారు. వారు సాధించిన విజయాలను కాంగ్రెస్ పార్టీ ఖాతాలో రాసుకునే ఉద్దేశం తమకు లేదని స్పష్టం చేశారు. లాఠీలు, తూటాలకు తలవంచకుండా పోరాడి 56 అడుగుల ఛాతీ అని చెప్పుకునే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మెడలు వంచి ధర్మేంద్ర ప్రధాన్‌తో వారు రాజీనామా చేయించగలిగారని కొనియాడారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో పోరాటం ముగిసిపోలేదన్నారు. పరీక్ష పేపర్ల లీక్‌తో చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యమం సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులపై బనాయించిన కేసులను సోమవారం లోపు ఎత్తేయకపోతే పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ, ఖర్గేల నాయకత్వంలో కాంగ్రెస్ పోరాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, అరికెపూడి గాంధీ, వల్లాల నవీన్ యాదవ్, శ్రీగణేష్, మల్ రెడ్డి రంగారెడ్డి, టి.రామ్మోహన్ రెడ్డి, సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సీపీఐ నేత పల్లా వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు నుంచి ‘సంజీవని’.. సద్వినియోగం చేసుకోండి

**అమరావతి - సూర్య వాస్తవం**

ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ‘సంజీవని’ పథకాన్ని ఆగస్టు నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయను న్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. “మీ ఆరోగ్యం.. మీ బాధ్యత” అని ప్రజలకు పిలుపునిచ్చిన ఆయన, ప్రభుత్వం అందించే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శనివారం కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గంలోని ఆస్పరిలో నిర్వహించిన ‘సంజీవని’ కార్యక్రమం బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. ప్రజారోగ్య పరిరక్షణకు ఆధునిక సాంకేతికతను జోడించి రూపొందించిన ఈ ప్రాజెక్టు విశిష్టతలను ప్రజలకు వివరించారు.

**సంజీవని.. సమగ్ర ఆరోగ్య వ్యవస్థ**

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. విద్య, వైద్యంపైనే ప్రతి కుటుంబం అధికంగా ఖర్చు చేస్తున్న నేపథ్యంలో, ప్రజల ఆరోగ్య బాధ్యతను ప్రభుత్వమే స్వీకరించేలా ‘సంజీవని’ని తీర్చిదిద్దామని తెలిపారు. ఈ పథకంలో భాగంగా ప్రతి పౌరునికి ఒక డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ రూపొందించి, కుటుంబ సభ్యులందరికీ హెల్త్ ఐడీలు జారీ చేస్తామని చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రజల ఆరోగ్య సమాచారాన్ని ఒకే వేదికపై అనుసంధానం చేస్తామని వివరించారు.

కేవలం వ్యాధి వచ్చాక చికిత్స అందించడమే కాకుండా, వ్యాధులు రాకముందే గుర్తించడం (ప్రెడిక్టివ్), నివారణ చర్యలు చేపట్టడం (ప్రివెంటివ్), అవసరమైనప్పుడు నాణ్యమైన వైద్యం అందించడం (క్యూరేటివ్) అనే త్రిముఖ వ్యూహంతో సంజీవని పనిచేస్తుందని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో 80 లక్షల మంది తీవ్ర వ్యాధులతో బాధపడుతున్నట్లు నివేదికలు చెబుతున్నాయని, ఈ పరిస్థితిని మార్చేందుకే ఈ ప్రాజెక్టును తీసుకొస్తున్నామని అన్నారు. నాన్ కమ్యూనికబుల్ వ్యాధులు, మాతా-శిశు సంరక్షణ, 108, 104 సేవలు, ఈ-ఔషధి వంటి అన్ని వ్యవస్థలను ఒకే డిజిటల్ గొడుగు కిందికి తీసుకొస్తామని వెల్లడించారు. భవిష్యత్తులో ఏఐ ఆధారిత వైద్య సహాయం, టెలీమెడిసిన్, రిమోట్ కేర్ వంటి సేవలను కూడా ఇందులో భాగం చేస్తామని తెలిపారు.

**సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట**

ప్రజారోగ్యంతో పాటు సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ప్రతి నెలా ఒకటో తేదీనే పెన్షన్లు, అన్నదాత సుఖీభవ కింద రైతులకు రూ.20 వేలు, తల్లికి వందనం, స్త్రీశక్తి, దీపం-2.0 వంటి పథకాలతో ప్రతి కుటుంబానికి అండగా నిలుస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో భూ రికార్డుల్లో సృష్టించిన గందరగోళాన్ని సరిదిద్దేందుకు బ్లాక్‌చైన్ టెక్నాలజీతో రీసర్వే చేపడుతున్నామని, వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. 2028 నాటికి కడప స్టీల్ ప్లాంట్‌లో ఉత్పత్తి, రూ.1 లక్ష కోట్ల పెట్టుబడులతో రాయలసీమను పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దుతామని భరోసా ఇచ్చారు.

**గత ప్రభుత్వంపై విమర్శలు.. సాగునీటిపై హామీ**

గత ఐదేళ్లలో గొడ్డలి పార్టీ నేతలు ఒక్క ఎకరాకు అదనంగా నీరు ఇవ్వలేదని, ఒక్క పరిశ్రమ తేలేదని చంద్రబాబు విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టులకు పైసా ఖర్చు చేయని వారే ఇప్పుడు రాయలసీమ అభివృద్ధి గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. వేదవతి ప్రాజెక్టును రూ.1,768 కోట్లతో పూర్తి చేసి ఈ ప్రాంతానికి సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో మూడేళ్లలో 36 సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ఇరిగేషన్ క్యాలెండర్ రూపొందించామని తెలిపారు.

**ప్రజల మధ్య ఉండే కామన్ మ్యాన్‌ను**

సభ అనంతరం అదే వేదికపై నుంచి ముఖ్యమంత్రి జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. తాను గత పాలకుల్లా పరదాలు కట్టుకుని, చెట్లు నరికించి సభలు పెట్టడం లేదని, ప్రజల మధ్యకు నేరుగా వస్తున్నానని అన్నారు. సీఎం అంటే సచివాలయంలో కూర్చునే చీఫ్ మినిస్టర్ మాత్రమే కాదని, ప్రజల మధ్య ఉండే కామన్ మ్యాన్ అని వ్యాఖ్యానించారు.

## జిల్లాను డ్రగ్ ఫ్రీగా తీర్చిదిద్దేందుకు సమిష్టి కృషి అవసరం: కలెక్టర్ ఓ. ఆనంద్

**- మాదకద్రవ్యాల నియంత్రణపై కలెక్టర్, ఎస్పీ సమీక్ష**
**- పాఠశాలలు, కళాశాలల్లో వారానికోసారి అవగాహన కార్యక్రమాలు**
**- యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడాలి**



**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం :** అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో మాదకద్రవ్యాల నియంత్రణ చర్యలు, ఎన్‌సీఓఆర్‌డీ జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ జిల్లా ఎస్పీతో కలిసి నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను డ్రగ్ ఫ్రీ జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యం గా యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. విద్యాసంస్థల్లో వారానికి ఒకసారి డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ), ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు (ఆర్ఐఓ), ప్రాంతీయ సంయుక్త సంచాలకులు (ఆర్జేడీలు) పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థుల్లో చైతన్యం పెంపొందించడం ద్వారా మాదకద్రవ్యాల వినియోగాన్ని సమర్థవంతంగా అరికట్టవచ్చని ఆయన పేర్కొన్నారు.

## విద్యతోనే ఎరుకల జాతికి విముక్తి

**- ఏకలవ్య స్ఫూర్తితో ముందుకు సాగాలి : సాకే పురుషోత్తం**



**ఉరవకొండ - సూర్య వాస్తవం :** ఉరవకొండ గిరిజన గురుకుల పాఠశాలలో శనివారం ఏకలవ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆల్ ఇం డియా ఏకలవ్య ఎరుకల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సాకే పురుషోత్తం ముఖ్య అతిథిగా హాజరై ఏకలవ్యుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎరుకల జాతి అభ్యున్నతికి విద్యే ప్రధాన ఆయుధమని అన్నారు. గురువుపై భక్తి, క్రమశిక్షణ, స్వయంకృషికి ఏకలవ్యుడు ప్రతీక అని పేర్కొంటూ, ప్రతి ఎరుకల విద్యార్థి ఏకలవ్య స్ఫూర్తితో ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం కల్పిస్తున్న గురుకుల విద్యా సౌకర్యాలు, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని తల్లిదండ్రులకు, సమాజానికి గర్వకా రణంగా నిలవాలని సూచించారు. ఎరుకల జాతి అభ్యున్నతికి అందరూ ఐక్యంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన గురుకుల ప్రిన్సిపల్ అరుణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఎరుకల సంఘ నాయకులు ఎరుకల రూపు, ఎరుకల బొజ్జప్ప, ఆర్‌ఎస్‌ఎఫ్ అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరంజీవి, వినయ్, ఫ్రెండ్స్ నందు, రాము తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు.

## కృపా సుజాతమ్మను పరామర్శించిన వైసీపీ మహిళా ఉపాధ్యక్షురాలు



**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి పట్టణం నియోజకవర్గ వైసీపీ క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడు బింగి కిరణ్ బాబు, బంగి అరుణ్, తల్లి వైసీపీ సీనియర్ నాయకురాలు మాజీ కౌన్సిలర్ కృపా సుజాతమ్మ మోకాలికి కర్నూల్ ఆసుపత్రి రైల్వే అపేరేషన్ చేసుకొని డిశ్చార్జ్ అయి ఇంటికి వచ్చిన విషయం తెలుసుకొని వారి ఇంటికి వెళ్లి పరామర్శించిన, త్వరగా కోలుకోవాలని అనంతపురం జిల్లా వైసీపీ మహిళా ఉపాధ్యక్షురాలు చంద్రగిరి రాధ యాదవ్, శూరశింగనపల్లె గ్రామం, గుత్తి వైసీపీ మహిళా నాయకు రాళ్ళు హేమలత రెడ్డి, గుత్తి టౌన్ మ హిళా ప్రెసిడెంట్, లావణ్య రెడ్డి టౌన్ కార్యదర్శి, భాగ్యలక్ష్మి యాదవ్, టౌన్ ఉపాధ్యక్షురాలు, గోపినాథ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి అందరు కలిసి పాల్గొన్నారు.

## ఘనంగా శయన తొలి ఏకాదశి వేడుకలు

**- దేశంలోనే ఏకైక గజేంద్రమోక్ష దేవాలయం**

**పామిడి - సూర్య వాస్తవం :** పామిడిలోని శ్రీఅనంత, గజ గరుడ,లక్ష్మి నారాయణస్వామి దేవాలయంలో శనివారం శయన ఏకాదశి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి ప్రధానపురోహితులు విశ్వనాథ శర్మ అభిషేకం, పూజలు నిర్వహించారు. విష్ణుసహస్రనామ పారాయణం గావించారు. శ్రీదేవి భూదేవి సమేత స్వామి వార్లను పల్లకిలో చేసి గోవింద నామాలను అలకిస్తూ ప్రకారోత్సవం నిర్వహించారు. మహా మంగళ హారతి గావించి వచ్చిన భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్య క్రమంలో దేవాలయ కమిటీసభ్యులు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.





# అనంతపురంలో కాంగ్రెస్ విజయోత్సవ ర్యాలీ

**- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై కాంగ్రెస్ శ్రేణుల విజయోత్సవం**
**- అనంతపురంలో శాలి దాదా గాంధీ నేతృత్వంలో భారీ ర్యాలీ**



**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం :** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన నేపథ్యంలో రాష్ట్ర కాంగ్రెస్ మైనారిటీ అధ్యక్షులు శాలి దాదా గాంధీ ఆధ్వర్యంలో అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో శనివారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన శాలి దాదా గాంధీ మాట్లాడుతూ, ఆర్‌ఎస్‌ఎస్ మనువాద భావ జాలంతో ప్రజలను మోసం చేస్తున్న బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా యువత, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, దేశ ప్రజలు ఏకమయ్యారని అన్నారు. ఈ ప్రజా ఉద్యమ ఫలితంగానే కేంద్ర కేబినెట్‌లో రాజీనామాలు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ ప్రజల ఒత్తిడికి తలొగ్గి నిర్ణయాలను వెనక్కి తీసుకోవాల్సి వచ్చిందని, ఇందుకు కాంగ్రెస్ పార్టీతో పాటు రాహుల్ గాంధీ నేతృత్వంలోని ఇండియా కూటమి ఉద్యమాలు ప్రధాన కారణమని ఆయన అభిప్రాయ పడ్డారు. ఈ విజయానికి మద్దతు తెలిపిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, దేశ ప్రజలు, ఉద్యమంలో పాల్గొన్న యువత, రాజకీయ పార్టీలు, కుటుంబ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఐక్యతే నిజమైన శక్తి అని, ప్రజా సమస్యలపై ఇలాంటి ఉద్యమాలు కొనసాగాలని పిలుపునిచ్చారు. ర్యాలీలో రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు సాకే శంకర్, జిల్లా మైనారిటీ అధ్యక్షులు శర్మ షోలి, ఎన్ఎస్ జిల్లా అధ్యక్షులు ఓబులేష్, మైనారిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ నవాబ్ జాకీ హుస్సేన్, రాయలసీమ అధికార ప్రతినిధి జాన్ వెస్లీ, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు హరి రాయల్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు



**ఒంగోలు టౌన్ - సూర్య వాస్తవం :** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసినట్లు పేర్కొంటూ జిల్లా కాంగ్రెస్, నగర కాంగ్రెస్ కమిటీల ఆధ్వర్యంలో శనివారం ఒంగోలులో విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. బాబూజీ కాంప్లెక్స్ వద్ద ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు సమర్పించి, పార్టీ జెండాలు చేతబట్టి నినాదాలు చేస్తూ బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ సైదా మాట్లాడుతూ, తొలి ఏకాదశి రోజున ప్రజాస్వామ్యం విజయం సాధించిందని అన్నారు. విద్యార్థులపై జరిగిన ఘటనలకు నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోడీ కూడా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ, ఇది విద్యార్థుల విజయమని, దేశవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. రాష్ట్ర కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు శ్రీపతి ప్రకాశం మాట్లాడుతూ, ప్రధాని మోడీ తరచూ చెప్పే “అచ్చే దిన్” ఇప్పుడు ప్రజాస్వామ్యానికి వచ్చాయని, బీజేపీ ప్రభుత్వానికి “సచ్చే దిన్” వచ్చాయని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఈదా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులపై జరిగిన దాడికి బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని కోరారు. కొండేపి నియోజకవర్గ సమన్వయకర్త శ్రీపతి సతీష్ మాట్లాడుతూ, ఇది విద్యార్థుల పోరాటానికి దక్కిన విజయమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు షేక్ రసూల్, గోరంట్ల కోటేశ్వరరావు, కాకర్లపూడి వేణు, జిల్లా ప్రధాన కార్యదర్శులు షేక్ రవూఫ్, పైనం మధు, శ్రీనివాసరాజు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మట్టి సుబ్బారావు, జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొంటుగుంట సుబ్బారావు, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు సుదర్శన్ రవి, కొప్పోలు సుబ్బారావు, యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు మహేష్, గిడ్డియన్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఏకలవ్య జయంతి వేడుకలు


**- ఎరుకల యువత విద్య, ఐక్యత, సామాజిక అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చిన సాకే వెంకటరామయ్య**



**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం :** పట్టణంలోని అశోక్‌నగర్ 28వ డివిజన్‌లో ఏకలవ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సాకే వెంకట రామయ్య అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏకలవ్య ఎరుకల సంఘం నాయకులు సాకే గోవింద్, రాయలసీమ అధ్యక్షులు ఎబ్బిలి శ్రీరాములు, ఎరుకల యువసైన్యం నాయకుడు పోలవీరా, జిల్లా గౌరవ సలహాదారు పెనుగొండ చంద్రయ్య, గుత్తి మండల ఉపాధ్యక్షుడు మార్కెట్ శీన తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, ఏకలవ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ఎరుకల యువత విద్య, ఐక్యత, సామాజిక అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సమాజ అభ్యున్నతి కోసం ఎరుకల జాతి అంతా ఐక్యంగా కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఏకలవ్య ట్రైబ్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు సాకే వెంకటరామయ్య మాట్లాడుతూ, సేవాలాల్ జయంతి, వాల్మీకి జయంతి వంటి వేడుకలు రాష్ట్ర స్థాయిలో ఘనంగా నిర్వహిస్తున్నట్లే, ఏకలవ్య జయంతిని కూడా ప్రభుత్వ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఏకలవ్య జయంతి ఎరుకల జాతి మొత్తం ఒకే వేదికపై కలిసే రోజు కావాలని, అన్ని సంఘాలు, మేధావులు, ఉద్యోగులు, మహిళలు, యువత స్వచ్ఛందంగా పాల్గొని జాతి ఐక్యతను చాటాలని కోరారు. భవిష్యత్తులో ఏకలవ్య జయంతిని ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

**ఈ సందర్భంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన ప్రధాన డిమాండ్లు :**

అనంతపురం నగరపాలక సంస్థలో 50 డివిజన్లకు జనాభా నిష్పత్తి ప్రకారం ఎస్టీ రిజర్వేషన్‌లో మూడు సీట్లు కేటాయించాలని కోరారు. రోస్టర్ ప్రకారం అశోక్‌నగర్ 28వ డివిజన్‌ను ఎస్టీ రిజర్వేషన్‌గా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. అనంతపురం టవర్ క్లాక్ వద్ద ఉన్న ఫ్లైఓవర్‌కు “ఏకలవ్య ఫ్లైఓవర్ బ్రిడ్జి”గా నామకరణం చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే ఎన్నికల్లో రాయలసీమ జోన్‌లకు ఎస్టీ రిజర్వేషన్ కల్పించాలని కోరారు. 50 సంవత్సరాలు దాటిన గిరిజన కుటుంబాలకు వెంటనే పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని కోరారు. ఎరుకల కార్పొరేషన్ ఏర్పాటు చేసి, కులవృత్తుల ఆధారంగా సబ్సిడీ రుణాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. భూమిలేని గిరిజన పేద కుటుంబాలకు సాగుభూమి కేటాయించాలని కోరారు. విదేశీ విద్యకు అర్హులైన ప్రతి గిరిజన విద్యార్థికి ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజన భూములకు పూర్తి రక్షణ కల్పించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎరుకల సంఘాల నాయకులు, యువత, మహిళలు, పెద్ద సంఖ్యలో ఎరుకల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే జేసీ అష్మిత్ రెడ్డి

- కమలపాడు వద్ద కాలువ పూడికతీత పనులను తనిఖీ చేసిన ఎమ్మెల్యే
- త్వరలో రజక సోదరులకు అందుబాటులోకి దోబి ఘాట్
- ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలే లక్ష్యమన్న ఎమ్మెల్యే



**యాడికి - సూర్య వాస్తవం :** తాడిపత్రి శాసనసభ్యులు జేసీ అష్మిత్ రెడ్డి శనివారం యాడికి మండలంలో పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ముందుగా యాడికి పట్టణంలో నూతనంగా నిర్మితమవుతున్న కళ్యాణ మండపాన్ని సందర్శించి నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం యాడికి మండలంలోని కమలపాడు గ్రామం వద్ద యాడికి కాలువలో చేపడుతున్న పూడికతీత, కంపచెట్ల తొలగింపు పనులను పరిశీలించారు. సాగునీటి సరఫరాకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా పను లను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తదుపరి కమ లపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన దోబి ఘాట్‌ను పరిశీలించారు. ఈ దోబి ఘాట్‌ను త్వరలోనే రజక సోదరుల వినియోగానికి అందుబాటులోకి తీసు కురానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా దోబి ఘాట్ నిర్మాణానికి సహ కరిం చిన ఎమ్మెల్యే జేసీ అష్మిత్ రెడ్డికి రజక సోదరులు కృతజ్ఞతలు తెలియ జేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్
- ఎక్కడా బయట చెత్త కనిపించరాదు..
- ఆస్తి, నీటి పన్నులు పూర్తిస్థాయిలో వసూలు చేసేందుకు చర్యలు తీసుకోవాలి
- అమృత్ కింద మంజూరైన ప్రతి పని గ్రౌండ్ చేయాలి
- టిడ్కో ఇళ్ల పూర్తిలో నిర్లక్ష్యం ఉండరాదు:జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..



**అనంతపురం ప్రతినిధి - సూర్య వాస్తవం :** నగర పాలక సంస్థతో పాటు జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలలో శానిటే షన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతపురం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో మున్సిపాలిటీలు, ఇంజినీరింగ్ విభాగం, ఏపీ టిడ్కో ఇళ్ల పురోగతిపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.కలెక్టర్ మాట్లాడుతూ నగ రాలు, పట్టణాల్లో ఎక్కడా చెత్త బయట కనిపించకుండా చర్య లు తీసుకోవాలని, చెత్త వేస్తున్న ప్రాంతాల్లో డస్ట్‌బిన్లు ఏర్పా టు చేసి రోజుకు రెండు నుంచి మూడు షిఫ్టులలో చెత్తను తొలగించాలని సూచించారు. ప్రతి ఇంటికి క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేయడంతో పాటు ఐఈసీ అవగాహన కార్యక్రమా లు నిర్వహించాలని, చెత్త సేకరణపై ప్రత్యేక పర్య వేక్షణ చేపట్టాలని ఆదేశించారు. అన్ని మున్సిపాలిటీ లలో కమాండ్ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి జీపీఎస్ ద్వారా చెత్త సేకరణ వాహనాల కదలికలను పర్యవేక్షించాలని తెలిపారు. వీధి కుక్కల స్టెరిలైజేషన్‌ను నిబంధనల ప్రకారం పూర్తి చేసి, యాంటీ ర్యాబీస్ వ్యాక్సినేషన్‌ను 100 శాతం అమలు చేయాలని సూచించారు. ఆస్తి, నీటి పన్నుల వసూళ్లలో అధికారులు మరింత చురుకుగా వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు. 2026--27 సంవత్సరానికి రూ.156.78 కోట్ల ఆస్తిపన్ను లక్ష్యానికి గాను ఇప్పటివరకు రూ.39.55 కోట్లు (25.23 శాతం) మాత్రమే వసూలు కావడంతో, లక్ష్య సాధనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. అలాగే రూ.38.11 కోట్ల నీటి పన్ను లక్ష్యంలో ఇప్పటివరకు రూ.4.68 కోట్లు మాత్రమే వసూలైనందున వసూళ్లను వేగవంతం చేయాలని సూచించారు. జిల్లాలో గుర్తించిన 4,528 ప్రైవేట్ ఖాళీ స్థలాలను జియో కోఆర్డినేట్లతో మ్యాపింగ్ చేసి శుభ్రంగా ఉంచాలని, శుభ్రపరిచే ముందు--తర్వాత ఫొటోలను గూగుల్ ఎర్త్‌లో అప్‌లోడ్ చేసి ప్రతి రెండు నెలలకు ఒకసారి పర్యవేక్షించాలని ఆదేశించారు. అమృత్ 1.0, అమృత్ 2.0 కింద మంజూరైన ప్రతి పనిని వెంటనే ప్రారంభించాలని, భూసేకరణ సమస్యలను తహసీల్దార్లు, ల్యాండ్ సెక్షన్ అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కరించాలని సూచించారు. లెగసీ వ్యర్థాల నిర్వహణ పనులను కూడా సకాలంలో పూర్తి చేయాలని అన్నారు. ఏపీ టిడ్కో పరిధిలో పూర్తి చేయాల్సిన 10,116 ఇళ్ల నిర్మాణంలో పురోగతి మందగించిందని పేర్కొన్న కలెక్టర్, పనులు వేగవంతం చేయాలని, నిర్లక్ష్యం వహించే



కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకుని అవసరమైతే బ్లాక్‌లిస్ట్ చేయాలని హెచ్చరించారు. సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ జస్వంత్ రావు, పబ్లిక్ హెల్త్ ఈఈ సూర్యనారాయణ, మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పేదల ఆకలి తీర్చడానికి నేను సైతం అన్న క్యాంటీన్ కోసం...!

- ఆర్యన్ స్కూల్‌లో ఘనంగా ప్రారంభమైన వినూత్న కార్యక్రమం
- ఆంధ్రప్రదేశ్‌లో తొలి విద్యాసంస్థగా ఆర్యన్ స్కూల్ గుర్తింపు
- విద్యార్థుల స్వచ్ఛంద విరాళాలతో అన్న క్యాంటీన్లకు మద్దతు
- డిస్కవర్ అనంతపురం అనిల్ ఆధ్వర్యంలో ప్రత్యేక సామాజిక సేవా కార్యక్రమం



**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం :** పేదలకు అన్న దానం చేయాలనే సేవాభావాన్ని విద్యార్థుల్లో పెంపొం దించడంతో పాటు, అన్న క్యాంటీన్లకు ప్రజల భాగ స్వామ్యాన్ని పెంచే లక్ష్యంతో డిస్కవర్ అనంతపురం అనిల్ వినూత్న కార్యక్రమం రూపొందించారు. అనంతపురం లోని ఆర్యన్ స్కూల్లో ఘనంగా ప్రారంభమైంది. డిస్కవర్ అనంతపురం వ్యవస్థాపకుడు ఎ.జి. అనిల్ కుమార్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుమారు 600 మంది విద్యార్థులు ఉన్న ఆర్యన్ స్కూల్ ఈ కార్యక్రమాన్ని అమలు చేసిన ఆంధ్రప్రదేశ్‌లోనే తొలి విద్యాసంస్థగా గుర్తింపు పొందింది.ఈ కార్య క్రమంలో భాగంగా ప్రతి విద్యార్థి స్వచ్ఛందంగా రూ.100 లేదా అంతకంటే ఎక్కువ మొత్తాన్ని అన్న క్యాంటీన్ ట్రస్ట్‌కు విరాళంగా అందించి, అన్న క్యాంటీన్ల ద్వారా పేదలకు భోజనం అందించే సేవలో భాగస్వాములు కానున్నారు.ఈ సందర్భంగా ఎ.జి. అనిల్ కుమార్ మాట్లాడుతూ, చిన్న వయస్సు నుంచే పిల్లల్లో సేవాభావం, పేదల పట్ల సానుభూతి, సామాజిక బాధ్యత వంటి విలువలను పెంపొందించడం అత్యంత అవసరమని అన్నారు. చిన్ననాటి నుంచే సమాజానికి తిరిగి ఇవ్వాలనే భావనను పిల్లల్లో నాటితే, భవిష్యత్తులో మరింత బాధ్యతాయు తమైన పౌరులు తయారవుతారు. ప్రతి విద్యార్థి అందించే చిన్న విరాళం కూడా ఆకలితో ఉన్న ఒక మనిషికి అన్నం పెట్టే గొప్ప సేవగా మారుతుంది. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో మానవత్వం, కరుణ, సామాజిక బాధ్యత మరింత బలపడ తాయి," అని ఆయన పేర్కొన్నారు. మొదటి దశలో అనంతపురం జిల్లాలో కనీసం 50 పాఠశాలల్లో ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి, అనంతరం జిల్లా వ్యాప్తంగా విస్తరించేలా కార్యాచరణ చేపడతామని ఆయన తెలిపారు.

ప్రజల భాగస్వామ్యంతో అన్న క్యాంటీన్లకు బలమైన మద్దతు అందించడంతో పాటు, విద్యార్థుల్లో సేవా దృక్పథాన్ని పెంపొందించే లక్ష్యంతో రూపొం దిన ఈ "నేను సైతం అన్న క్యాంటీన్ కోసం" కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఆదర్శంగా నిలవనుందని పలువురు అభిప్రాయపడ్డారు.



# మంత్రులకు ఘన స్వాగతం పలికిన యువ నాయకుడు అనిల్ గౌడ్



**గుంతకల్ -సూర్య వాస్తవం :** ఆస్పరిలో జరుగుతున్న సీఎం చంద్రబాబు కార్యక్రమానికి గుంతకల్లు మీదుగా వెళుతున్న ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల శాఖ మాత్యులు నిమ్మల రామ నాయుడు, ఆరోగ్య శాఖ మాత్యులు సత్యకుమార్ యాదవ్‌ని గుంతకల్లు మాజీ శాసన సభ్యులకు ఆర్. జితేంద్ర గౌడ్ ఆదేశాలు మేరకు యువనేత అనిల్ గౌడ్ తెదేపా శ్రేణులతో కలిసి రైల్వే స్టేషన్ లో ఘన స్వాగతం పలికిన అనంతరం రైల్వే గెస్ట్ హౌస్‌లో మర్యాద పూర్వకంగా కలవడం ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# " తల్లికి వందనం"లో రూ.15 వేలు హామీ.. రూ.13 వేలే జమ:

- ప్రభుత్వం సమాధానం చెప్పాలి : మంజునాథ్ రెడ్డి
- ఎన్నికల హామీని పూర్తిగా అమలు చేయలేదని విమర్శ
- అర్హులందరికీ పూర్తి రూ.15,000 ఇవ్వాలని డిమాండ్
- లబ్ధి పొందని వారి వివరాలను ప్రకటించాలన్న వైసీపీ




**కూడేరు - సూర్య వాస్తవం :** రాష్ట్ర ప్రభుత్వం "తల్లికి వందనం" పథకం కింద ఒక్కో విద్యార్థికి రూ.13,000 జమ చేయడం ఎన్నికల హామీకి విరుద్ధమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం ఉపాధ్యక్షుడు మంజునాథ్ రెడ్డి విమర్శించారు. ఎన్నికల సమయంలో టీడీపీ కూటమి ప్రభుత్వం, ముఖ్యంగా నారా లోకేష్ ప్రతి విద్యార్థికి రూ.15,000 అందిస్తామని హామీ ఇచ్చిందని, ఇప్పుడు రూ.13,000 మాత్రమే జమ చేయడం ద్వారా ఆ హామీని పూర్తిగా అమలు చేయలేదని ఆయన పేర్కొన్నారు.గతంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం "అమ్మ ఒడి" పథకం కింద రూ.15,000 ప్రకటించి, అందులో రూ.1,000ను పాఠశాల నిర్వహణ కోసం ఉంచి రూ.14,000ను నేరుగా తల్లుల ఖాతాల్లో జమ చేసేదని గుర్తు చేశారు. అప్పట్లో దీనిని "జే టాక్స్" అంటూ విమర్శించిన వారు, ఇప్పుడు రూ.15,000 హామీ ఇచ్చి రూ.13,000 మాత్రమే ఇవ్వడంపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన వివరాల ప్రకారం ఈ పథకం ద్వారా సుమారు 67.47 లక్షల మంది విద్యార్థులు, 42.70 లక్షల మంది తల్లులు/ గార్డియన్లు లబ్ధి పొందాల్సి ఉందని, ఇప్పటికే 64.76 లక్షల మంది విద్యార్థులు ధృవీకరించ బడిన లబ్ధిదారులుగా ఉన్నారని తెలిపారు. అయితే రాష్ట్రవ్యాప్తంగా ఇంకా డబ్బులు అందని అర్హులున్నారని అనేక ప్రాంతాల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని పేర్కొన్నారు. జిల్లా, నియోజకవర్గం, మండలాల వారీగా అర్హుల సంఖ్య, లబ్ధి పొందిన వారి సంఖ్య, ఇంకా లబ్ధి అందని వారి వివరాలను ప్రభుత్వం బహిరంగంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ఎన్నికల హామీలను పూర్తిగా అమలు చేయాలని, అర్హులైన ప్రతి విద్యార్థికి హామీ ఇచ్చిన విధంగా పూర్తి రూ.15,000 అందించి, ఇంకా నిధులు అందని వారికి వెంటనే విడుదల చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం తరపున ప్రభుత్వాన్ని మంజునాథ్ రెడ్డి కోరారు.

# సీహెచ్‌సీలో అరుదైన శస్త్రచికిత్స విజయవంతం

-ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందిస్తున్న వైద్య బృందం





**పామిడి - సూర్యవాస్తవం :** కడప జిల్లా రైల్వే కొండాపురం మండలం, మురు గన్‌పల్లి గ్రామానికి చెందిన సుదీప గత కొన్ని నెలలుగా 9 ఐ 6 సెంటీమీటర్ల పరిమాణంలో ఉన్న ఒవేరియన్ గడ్డ (ఓవరియన్ మాస్ )తో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యకు సంబంధించి అనేక ఆసుపత్రుల్లో చికిత్స పొందినప్పటికీ ఆశించిన ఫలితం లభించలేదు. ఈ నేపథ్యంలో పామిడి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో డా. ఆర్. కమలాధర్ గైకాలజిస్ట్ డా. వై.ఎస్. రాఘవేంద్ర రెడ్డి కాషన్ డా. జి. మహేష్ కుమార్ మెడికల్ ఆఫీసర్ జె. శివకుమారి హెడ్ నర్స్ జె నాగరత్నమ్మ స్టాఫ్ నర్స్ లతో కూడిన వైద్య బృందం అత్యంత నైపుణ్యంతో అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించింది. శస్త్రచికిత్స అనంతరం రోగి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉండి, ప్రస్తుతం కోలుకుంటున్నారు. ఈ సందర్భంగా రోగి భర్తతో పాటు కుటుంబ సభ్యులు, బంధువులు వైద్య బృందానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ తమ హర్షాన్ని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు కూడా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే అత్యాధునిక వైద్య సేవలు క్లిష్టమైన శస్త్రచికిత్సలు విజయవంతంగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పామిడి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో అనుభవజ్ఞులైన వైద్యులు, నర్సింగ్ సిబ్బంది మరియు ఇతర వైద్య సిబ్బంది సమిష్టి కృషితో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు నిరంతరం అందిస్తున్నామని పేర్కొన్నారు.రోగికి విజయవంతంగా చికిత్స అందించిన వైద్యులు నర్సింగ్ సిబ్బందిని స్థానిక ప్రజలు అభినందిస్తూ ప్రభుత్వ ఆసుపత్రిలో ఇలాంటి క్లిష్టమైన శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు.

# ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

- మంత్రి ఆనంకు మాజీ ఎంపీ నెలవల వినతి
- మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన నెలవల సుబ్రహ్మణ్యం
- నియోజకవర్గ అభివృద్ధి, రాజకీయాలపై చర్చ



**నాయుడుపేట – సూర్య వాస్తవం :** రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని తెలుగుదేశం పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ ఇంచార్జి, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లూరులోని మంత్రి నివాసంలో జరిగిన ఈ భేటీలో మంత్రి ఆనంకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, సూళ్లూరుపేట నియోజకవర్గ పరిధిలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాలు, అమ్మవారి ఆలయాల అభివృద్ధికి అవసరమైన నిధులను మంజూరు చేయాలని మంత్రిని కోరారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిం చేందుకు ఆలయాల అభివృద్ధి అత్యవసరమని ఆయన వివరించారు. దీనిపై స్పం దించిన మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతిపాదనలను పరిశీలించి సాధ్యమైన మేరకు సహ కారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. అనంతరం సూళ్లూరుపేట నియో జకవర్గ అభివృద్ధి కార్యక్రమాలు, దేవాదాయ శాఖ పరిధిలో చేపట్టాల్సిన పనులు, ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై ఇరువురు నేతలు విస్తృతంగా చర్చించారు. ఈ సమా వేశంలో తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

# దీర్ఘకాలిక ఆదాయానికి పండ్ల తోటల పెంపకం శ్రేయస్కరం

- ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ "



**దొరవారిసత్రం –సూర్య వాస్తవం :** వర్షా బావ పంటలగా,దీర్ఘకాలిక ఆదాయాన్ని సమకూర్చే పండ్ల తోటల పెంపకం శ్రేయస్కరమని సూళ్లూరుపేట నియోజకవర్గం ఎమ్మెల్యే విజయ శ్రీ అన్నారు.శనివారం దొరవారి సత్రం మండల పరిధిలోని తల్లంపాడు పంచాయతీలో గ్రామీణ అభివృద్ధి,పంచాయితీ రాజ్ శాఖలు సంయుక్తంగా ఏర్పాటుచేసిన వికసిత్ భారత్–గ్రామ్ రోజ్ గార్ ఆ జీవక్ మిషన్ గ్రామీణ్ కార్యక్రమం కింద పండ్ల తోటల పెంపకం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.జామ పండ్ల తోటల పెంపకం కింద మొక్కలు నాటారు.125 రోజులు ఉపాధి హామీ, రైతుల ఆదాయ వృద్ధి,హరిత అభివృద్ధి వంటి లక్ష్యాలను అమలు చేస్తుందన్నారు. నీటి వనరులు లేక నిరుపయోగంగా ఉన్న బీడు భూములున్న రైతులు ప్రభుత్వం సబ్సిడీ ద్వారా కల్పిస్తున్న పండ్లతోటల పెంపకానికి మొగ్గు చూపాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వేమసాని శ్రీనివాసులు నాయుడు, ఉపాధి హామీ పథకంఏ.పి.ఓ,పలు శాకల అధికారులు, పొదుపు సంఘాల గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# విద్య ద్వారానే ఉజ్వల భవిష్యత్తు

- 1981-82 బ్యాచ్ పూర్వ విద్యార్థులచే 12 మంది విద్యార్థులకు ఘన సన్మానం

**ప్యాపిలి– సూర్య వాస్తవం :** ప్యాపిలి మండలం హుస్సేనాపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు బి . చంద్రమౌళి అధ్యక్షతన ఏర్పాటు చేసిన అభినందన సభ లో 2025–26 సంవత్సరంలో జరిగిన పదవ తరగతి పరీక్షలలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన (500 పైబడి మార్కులు సాధించిన) 12 గురు విద్యార్థులను వారి తల్లిదండ్రులను ఇదే పాఠశాలలో చదివిన 1981–82 ఎస్ఎస్సి బ్యాచ్ చెందిన పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు బి.చంద్రమౌళి మాట్లాడుతూ ఉన్నత విద్య చదివి ఉజ్వల భవిష్యత్ పొందాలంటే 10 వ తరగతిలో బలమైన పునాది అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమం లో పాల్గొన్న 1981–82 బ్యాచ్ పూర్వ విద్యార్థులు చిట్టురు శ్రీనివాసరాజు,నబిరసూల్, శ్రీనివాస రెడ్డి, వెంకటరాముడు, శివ శంకర రెడ్డి విద్యార్థులను సిల్వర్ మెడల్, శాలువా, మెమెన్టో తో ఘనంగా సత్కరించారు.ఇదే సందర్భంగా ఇదే గ్రామానికి చెందిన పాఠశాల పూర్వ విద్యార్థి గ్రామ మాజీ సర్పంచ్ అయిన పి.మహేశ్వరరెడ్డి విద్యార్థులందరికీ కలిపి పదివేల నగదు బహుమతిని ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమం లో పాఠశాల విశ్రాంత ప్రధానోపాధ్యాయుడుఎస్ . అన్వర్ బాష ముఖ్య అతిథి గా హాజరై విద్యార్థులను ఉత్తేజ పరిచారు. ఈ కార్యక్రమం లో ఎస్ఎంసిచైర్మన్ జె . రవికుమార్ పూర్వ విద్యార్థులు లక్ష్మి నారాయణ గౌడ్, రామకృష్ణ రెడ్డి, రమేష్, శ్రీను, పాఠశాల ఉపాధ్యాయులు గోపాల్, సర్వజ్ఞమూర్తి, దివాకర్, చార్లెస్, కంభగిరి, సుజాతమ్మ, జయలక్ష్మి, రుక్సానా ఖ?టూన్, మహేంద్ర, శ్రీకాంత్,సశీధ్య రాణి, మురళి, బోరెడ్డి,శ్రావణి, పుల్లయ్య,తదితరులు మరియు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



# ఇసుకాసురుల కబంధ హస్తాల్లో స్వర్ణముఖి..!

- పేన్నేపల్లి వద్ద రాత్రింబవళ్లు యథేచ్ఛగా ఇసుక దోపిడీ
- ఉచిత ఇసుక పేరుతో లక్షల టన్నుల తరలింపు..
- గుంటలమయమైన నదీ పరివాహక ప్రాంతం
- హైకోర్టు స్టే ఉన్నా కళ్లుమూసుకున్న అధికారులు.. రైతుల్లో తీవ్ర ఆందోళన
- మండలంలో తాగునీటి వనరులకు, సాగునీటికి ముప్పు
- ప్రకృతి సంపదను కొల్లగొడుతున్న ఇసుక మాఫియా.. స్పందించని యంత్రాంగం





**పెళ్లకూరు– సూర్య వాస్తవం :** ఒకప్పుడు ఇసుక నిల్వలకు ప్రతీకగా నిలిచిన పెళ్లకూరు మండలం పెన్నేపల్లి గ్రామ సమీపంలోని స్వర్ణముఖి నది, ప్రస్తుతం ఇసుక మాఫియా దోపిడీకి బలై తన సహజ స్వరూపాన్ని కోల్పోతోంది. ఉచిత ఇసుక పేరుతో జరుగుతున్న యథేచ్ఛ అక్రమ తవ్వకాలతో నది గర్భం పూర్తిగా గుంటలమయమై, గడ్డి, ధర్బలు మొలిచిన బీడు భూమిని తలపిస్తోంది. స్థానికుల కథనం ప్రకారం, రాత్రిం బవళ్లు ట్రాక్టర్లతో నిరంతరంగా ఇసుక తరలింపు కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. నిబంధనలు ఉన్నప్పటికీ వాటి అమలుపై అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించడం వల్ల అక్రమ రవాణాదారులకు అడ్డుకట్ట లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**భూగర్భ జలాలపై తీవ్ర ప్రభావం**

పెన్నేపల్లి స్వర్ణముఖి నది తీరాన 65కు పైగా బోర్‌వెల్లు ఉండగా, వాటి ద్వారా వందల ఎకరాల వ్యవసాయ భూములకు సాగునీరు అందుతోంది. ఇసుక రవాణా చేస్తున్న ప్రాంతానికి సమీపంలో మండలనికి తాగునీరు సరఫరా చేసే పంపు బావులు కూడా ఉన్నాయి. ఇసుకను విచక్షణారహితంగా తొలగించడం వల్ల భూగర్భ జలాల మట్టం తగ్గిపోయి, భవిష్యత్తులో సాగునీరు, తాగునీటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని రైతులు హెచ్చరిస్తున్నారు.

**హైకోర్టు స్టే ఉన్నా ఆగని అక్రమాలు**

2022లో పెన్నేపల్లి, తాల్వాయిపాడు గ్రామాలకు చెందిన రైతులు స్వర్ణముఖి నుంచి ఇసుక తరలింపును అడ్డుకోవాలని హైకోర్టును ఆశ్రయించి స్టే ఉత్తర్వులు పొందారు. ఆ సమయంలో అధికారికంగా ఏర్పాటు చేసిన ఇసుక రీచ్ కార్యకలాపాలు నిలిచిపోయినా, స్థానికంగా ట్రాక్టర్ల ద్వారా జరుగుతున్న అక్రమ ఇసుక రవాణా మాత్రం ఇప్పటికీ నిరాటంకంగా కొనసాగుతోందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

**మొక్కుబడిగా ఫిర్యాదులు.. ఫలితం శూన్యం**

అక్రమ ఇసుక రవాణాపై పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినా, మీడియా ద్వారా విషయం వెలుగులోకి తీసుకొచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్లక్ష్యమే అక్రమ రవాణాదారులకు మరింత ధైర్యాన్ని ఇచ్చిందని వారు అంటున్నారు.

**తక్షణ చర్యలు తీసుకోవాలని రైతుల విజ్ఞప్తి**

ప్రకృతి సంపదను పరిరక్షించాల్సిన బాధ్యత అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులపై ఉందని రైతులు పేర్కొంటున్నారు. అక్రమ ఇసుక రవాణాను వెంటనే అరికట్టి, స్వర్ణముఖి నదిని పరిరక్షించాలని, తద్వారా భవిష్యత్ తరాలకు తాగునీరు, సాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.





# బీపీ, షుగర్‌ను నిర్లక్ష్యం చేయొద్దు..

- క్రమం తప్పకుండా మందులు వాడాలి
- 104 సంచార వైద్యశాలలో ఉచిత వైద్య సేవలు
- రాసనూరులో రోగులకు పరీక్షలు, మందుల పంపిణీ
- క్యాన్సర్ లక్షణాలు, దోమల నివారణపై అవగాహన కల్పించిన వైద్యులు

**పెళ్లకూరు– సూర్య వాస్తవం:** అధిక రక్తపోటు (బీపీ), మధుమేహం (షుగర్) వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులు ఎట్టి పరిస్థితుల్లోనూ మందులను మధ్యలో ఆపకుండా, వైద్యుల సూచనల మేరకు క్రమం తప్పకుండా వినియోగించాలని 104 సంచార వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ చంద్రమోహన్ సూచించారు. శనివారం చెంబేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) పరిధిలోని రాసనూరు గ్రామంలో నిర్వహించిన 104 సంచార వైద్యశాల ఉచిత వైద్య శిబిరంలో ఆయన పాల్గొని రోగులకు వైద్య సేవలు అందించారు. శిబిరంలో సాధారణ జ్వరాలు, దగ్గు, జలుబు, శరీర నొప్పులు వంటి సాధారణ అనారోగ్య సమస్యలకు చికిత్స చేయడంతో పాటు, బీపీ మరియు షుగర్ వ్యాధులతో బాధపడుతున్న వారికి ప్రత్యేకంగా రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయిలను పరీక్షించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రమోహన్ మాట్లాడుతూ, బీపీ, షుగర్ వంటి వ్యాధులను నిర్లక్ష్యం చేస్తే గుండె, మూత్రపిండాలు, మెదడు వంటి కీలక అవయవాలపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల వైద్యుల సూచనలను పాటిస్తూ ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, క్రమబద్ధమైన జీవనశైలిని అనుసరించాలని రోగులకు సూచించారు. అదేవిధంగా, వివిధ రకాల క్యాన్సర్ వ్యాధుల ప్రారంభ లక్షణాలు, ముందస్తు జాగ్రత్తలు, ప్రారంభ దశలోనే పరీక్షలు చేయించుకోవడం వల్ల చికిత్స సులభమవుతుందని ప్రజలకు వివరించారు.

మహిళలు, వృద్ధులు ఆరోగ్య పరీక్షలను నిర్లక్ష్యం చేయకుండా తరచూ చేయించుకోవాలని సూచించారు. వర్షాకాలంలో దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి జ్వరాల నివారణకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, ప్రతి శుక్రవారం 'డ్రై డే' గా పాటిస్తూ నీటి నిల్వ పాత్రలను పూర్తిగా ఖాళీ చేసి ఎండబెట్టాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా దోమల ఉత్పత్తిని అరికట్టవచ్చని వివరించారు. గ్రామస్తులకు ఏవైనా ఆరోగ్య సమస్యలు తలెత్తినా వెంటనే గ్రామంలోని ఆశా కార్యకర్తలను సంప్రదించాలని, అవసరమైతే 104 సంచార వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చంద్రమోహన్, ఎంఎల్‌హెచ్‌పీ సుజాత, హెల్త్ అసిస్టెంట్ హరిబాబు, ఆశా కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.





# నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో గ్రాండ్ పేరెంట్స్ డే






**దొరవారిసత్రం – సూర్య వాస్తవం :** సూళ్లూరుపేట నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో శనివారం ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి స్కూల్ ఏ జీ ఎమ్ రియాజ్ ఎక్కిడ్జ్ జోనల్ కోఆర్డినేటర్ పుష్పలత ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏజిఎమ్ మాట్లాడుతూ విద్యార్థులను వృద్ధిలోకి తీసుకురావడానికి ఇలాంటి కార్యక్రమాలు అవసరమని ఇంత మంది పేరెంట్స్ వచ్చి మీ సలహాలు,సూచనలు ఇవ్వడం సంతోషంగా ఉందని తెలిపారు.కోఆర్డినేటర్ పుష్పలత మాట్లాడుతూ ఈరోజు కార్యక్రమం కన్నులపండుగగా ఉందని మీ సహకారం మాకు ఎప్పుడూ ఇలాగే ఉండాలని ఆకాంక్షించారు.ప్రిన్సిపాల్ శివ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు పేరెంట్స్ మొదటి టీచర్ అని స్కూల్ కు వచ్చాక టీచర్సె పేరెంట్స్ అని ఇలా పేరెంట్స్ డే లో పరస్పరం మాట్లాడుకోవడం వలన విద్యార్థులకు విద్యాబుద్దులు నేర్పించడం సులువవుతుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఏ ఓ మురళి,వైస్ ప్రిన్సిపాల్ ప్రవళిక, ఇంచార్జిలు మరియు ఉపాధ్యాయబృందం పాల్గొన్నారు.కార్యక్రమంలో భాగంగా తల్లిదండ్రులకు ఆటలుపోటీలు నిర్వహించి బహుమతులు అందజేయడం జరిగింది.పిల్లల సర్వం తో ముఖాభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు అవసరమని తల్లిదండ్రులు తెలియజేశారు.

# ఎస్‌డిహెచ్‌ఆర్ విద్యార్థులకు అవగాహన సదస్సు





**దొరవారిసత్రం – సూర్య వాస్తవం :** క్యాంపస్ టు కార్పొరేట్ అనే అంశంపై ప్రత్యేక నిపుణులచే శ్రీ దేవపట్ల హరినాద్ రెడ్డి డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.న్యూ బాలాజీ కాలనీలోని ఎస్ డి హెచ్ ఆర్ విద్యా సంస్థలలో శనివారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆ విద్యాసంస్థల చైర్మన్ డివిఎస్ చక్రవర్తి రెడ్డి మాట్లాడుతూ విద్యాసంస్థలలోని విద్యార్థులను ఉన్నత స్థాయి ఉద్యోగాలకు సిద్ధం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు.పరిశ్రమల నిపుణులతో ప్రత్యక్షంగా విద్యార్థులను అనుసంధానం చేయడం ద్వారా వారిలో నైపుణ్యాలను పెంపొందించడంతోపాటు కార్పొరేట్ ప్రపంచంలో విజయవంతంగా రాణించేలా తీర్చిదిద్దుతామని తెలిపారు.రాబోయే భవిష్యత్తులో మరిన్ని పరిశ్రమల నిపుణులతో ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఉత్తమ అవకాశాలు కల్పిస్తామని చక్రవర్తి రెడ్డి విద్యార్థులకు చెప్పారు. కళాశాల ప్రిన్సిపల్ ఏ ఉష మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు కేవలం అకాడమిక్ లో కాకుండా కమ్యూనికేషన్ నాయకత్వపు లక్షణాలు అలవర్చుకోవాలని తెలిపారు. సమస్యల పరిష్కార నైపుణ్యాలను కూడా పెంపొందించుకోవాలని పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చి విద్యార్థులకు మా కళాశాల ఇలాంటి నిపుణుల సదస్సులు శిక్షణ కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తోందని పేర్కొన్నారు.ఈ అవగాహన సదస్సులో బెంగళూరుకు చెందిన ఐటీసీ హెచ్ఆర్ మేనేజర్ శంకర్ ముఖ్య వక్తగా పాల్గొని విద్యార్థులకు కార్పొరేట్ రంగ నైపుణ్యాలపై అవగాహన కల్పించారు.

# థియేటర్లలో పెద్ద సర్‌ప్రైజ్ ఉంటుంది: ‘న్యూటన్స్ థర్డ్ లా’పై హీరో సుమంత్

-సుమంత్ హీరోగా నటించిన ‘న్యూటన్స్ థర్డ్ లా’ థ్రిల్లర్ చిత్రం జులై 31న థియేటర్లలో విడుదల కానున్నట్టు ప్రకటన
-‘మళ్లీ రావా’ తర్వాత సింగిల్ సిట్టింగ్‌లోనే ఈ కథను ఓకే చేశానన్న సుమంత్
-ఈ సినిమా థ్రిల్లర్ జానర్‌ను రీడిఫైన్ చేస్తుందని దర్శకుడు రాజేశ్ కర్ణ ధీమా
ట్రైలర్ లాంచ్ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన హీరో అడివి శేష్



హీరో సుమంత్ ప్రధాన పాత్రలో, ఈటీవీ విన్ నిర్మాణంలో తెరకెక్కిన యూనిక్ థ్రిల్లర్ ‘న్యూటన్స్ థర్డ్ లా’. రాజేశ్ కర్ణ దర్శకత్వం వహించిన ఈ చిత్రం జులై 31న థియేటర్లలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ హీరో అడివి శేష్ ముఖ్య అతిథిగా హాజరై సందడి చేశారు. ట్రైలర్‌ను వీక్షించిన అనంతరం అడివి శేష్ మాట్లాడుతూ, "‘న్యూటన్స్ థర్డ్ లా’ ట్రైలర్ చాలా బాగుంది. ఒక సీట్ ఎడ్జ్ థ్రిల్లర్‌లా అనిపిస్తోంది. దర్శకుడు రాజేశ్ నాకు మంచి స్నేహితుడు. సుమంత్ నా ఫేవరెట్ బ్రో. నా మొదటి సినిమా నుంచి నాకు ఎంతో సపోర్ట్‌గా ఉన్నారు. జగపతి బాబు గారు చాలా స్టైలిష్‌గా కనిపిస్తున్నారు. జులై 31న ఈ సినిమాను అందరూ ఆదరించాలి" అని కోరారు. హీరో సుమంత్ మాట్లాడుతూ సినిమాపై తనకున్న నమ్మకాన్ని పంచుకున్నారు. "‘మళ్లీ రావా’ తర్వాత సింగిల్ సిట్టింగ్‌లోనే ఓకే చేసిన కథ ఇది. ఈ సినిమాలో హీరో స్క్రీన్‌ప్లే. ప్రతి పాత్రకూ ప్రాధాన్యత ఉండటంతో పాటు, కథను మలుపు తిప్పే అవకాశం ఉంటుంది. అందుకే ఈ సినిమాను అంగీకరించాను. మంచి థ్రిల్ ఉన్నప్పటికీ, దీని సెంట్రల్ డ్రామా ఫ్యామిలీ చుట్టూ తిరుగుతుంది. అందుకే ఈటీవీ విన్ ఫ్యామిలీ ఆడియన్స్‌ను కూడా ఇది ఆకట్టుకుంటుంది. ట్రైలర్‌లో మేము చాలా తక్కువ కథనే చూపించాం. జులై 31న థియేటర్లకు వస్తే మీకు పెద్ద సర్‌ప్రైజ్ ఉంటుంది," అని తెలిపారు. దర్శకుడు రాజేశ్ కర్ణ మాట్లాడుతూ, "ఈ సినిమా మీకు కచ్చితంగా గొప్ప అనుభూతిని ఇస్తుంది. ఇంటర్వెల్‌కే పైసా వసూల్ ఫీలింగ్ వస్తుంది. క్లైమాక్స్ మైండ్‌బ్లోయింగ్‌గా ఉంటుంది. మహేశ్ బాబు గారి ‘1 నేనొక్కడినే’ సినిమా తర్వాత ఫిల్మ్‌మేకింగ్ గురించి ఎలా చర్చ జరిగిందో, ఈ సినిమా గురించి కూడా అలానే మాట్లాడుకుంటారు. ‘న్యూటన్స్ థర్డ్ లా’ థ్రిల్లర్ జానర్‌ను రీడిఫైన్ చేస్తుంది" అని ధీమా వ్యక్తం చేశారు. ఈటీవీ విన్ బిజినెస్ హెడ్ సాయి కృష్ణ, కంటెంట్ హెడ్ భరణ్ మాట్లాడుతూ.. వైవిధ్యమైన కథలతో తమ బ్రాండ్‌ను నిర్మిస్తున్నామని, ‘న్యూటన్స్ థర్డ్ లా’ ఆ కోవలోనిదేనని పేర్కొన్నారు. నిర్మాత హరీశ్, హీరోయిన్ నేహా, సంగీత దర్శకుడు సింజిత్, నటులు త్రినాథ్, రవి వర్మ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని సినిమా విజయంపై విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ చిత్రంలో జగపతిబాబు, అవసరాల శ్రీనివాస్, రవివర్మ, నేహా పఠాన్ తదితరులు కీలక పాత్రలు పోషించారు.



## దుల్కర్, పూజా హెగ్డే ‘శ్రీ శ్రీ’.. తొలి గీతం విడుదలకు ముహూర్తం ఫిక్స్

‘శ్రీ శ్రీ’ సినిమా నుంచి తొలి పాట ‘బొమ్మ బొమ్మ’
జులై 27న సాయంత్రం 5:04 గంటలకు విడుదల
జీవీ ప్రకాశ్ కుమార్ ఈ చిత్రానికి సంగీత దర్శకుడు
సుధాకర్ చెరుకూరి నిర్మాణంలో పాన్ ఇండియా చిత్రం
తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో రిలీజ్

దుల్కర్ సల్మాన్, పూజా హెగ్డే జంటగా శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న తాజా చిత్రం ‘శ్రీ శ్రీ’. ఈ సినిమా నుంచి సంగీత ప్రమోషన్లను ప్రారంభించేందుకు చిత్ర యూనిట్ సిద్ధమైంది. ఇందులో భాగంగా, ప్రముఖ సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్ కుమార్ స్వరపరిచిన తొలి సింగిల్ ‘బొమ్మ బొమ్మ’ను జులై 27న సాయంత్రం 5:04 గంటలకు విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు ఒక ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశారు. ‘అసంఖ్యాకమైన మధుర జ్ఞాపకాలను తిరిగి గుర్తుచేసే పాట’ అంటూ ఈ గీతంపై చిత్రబృందం ఆసక్తిని పెంచింది. ‘లవ్ విల్ స్పార్క్ అగైన్’ (ప్రేమ మళ్లీ చిగురిస్తుంది) అనే ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ సినిమా, ఒక అందమైన ప్రేమకథగా రూపుదిద్దుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ పాటను ప్రముఖ మ్యూజిక్ లేబుల్ ‘సరిగమ సౌత్’ ద్వారా విడుదల చేయనున్నారు. ‘శ్రీ శ్రీ’ చిత్రానికి రవి నేలకుడిటి రచన, దర్శకత్వం వహిస్తున్నారు. ఇషాన్ సక్సేనా సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో నిర్మిస్తుండటంతో ‘బొమ్మ బొమ్మ’ పాటను కూడా తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో ఒకేసారి విడుదల చేయనున్నారు. ‘శ్రీ శ్రీ’ చిత్రానికి అనీ ఓం గోస్వామి సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, కోటగిరి వెంకటేశ్వరరావు ఎడిటర్‌గా, అవినాష్ కొల్లా ఆర్ట్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి, 2026 డిసెంబర్‌లో ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్మాతలు లక్ష్యంగా పెట్టుకున్నారు.

## ధనుష్ కొత్త చిత్రం ‘ఓం’... టైటిల్ టీజర్ అదిరింది!

ధనుష్ 55వ చిత్రానికి ‘ఓం’ అనే టైటిల్ ఖరారు
‘ఫస్ట్ స్ట్రైక్’ పేరుతో తెలుగు టైటిల్ టీజర్‌ను విడుదల చేసిన చిత్రబృందం-మమ్ముట్టి, సాయి పల్లవి, శ్రీలీల వంటి భారీ తారాగణం-రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో వస్తున్న చిత్రం-అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల




విలక్షణ నటుడు ధనుష్ తన 55వ సినిమా టైటిల్‌ను అధికారికంగా ప్రకటించారు. భారీ అంచనాల నడుమ వస్తున్న ఈ చిత్రానికి ‘ఓం’ అనే శక్తివంతమైన టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సందర్భంగా ‘ఫస్ట్ స్ట్రైక్’ పేరుతో తెలుగు టైటిల్ టీజర్‌ను చిత్రబృందం శనివారం విడుదల చేసింది. ఈ టీజర్ సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో తారాగణం ఓ రేంజ్‌లో ఉంది. మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి, నాచురల్ బ్యూటీ సాయి పల్లవి, టాలీవుడ్ క్రేజీ హీరోయిన్ శ్రీలీల కీలక పాత్రల్లో నటిస్తుండటంతో ఇది ఒక భారీ మల్టీస్టారర్ ప్రాజెక్ట్‌గా రూపుదిద్దుకుంటోంది. ‘చాప్టర్ 1: రుధిరం – ది బ్లడ్ వుడ్’ అనే ట్యాగ్‌లైన్‌తో విడుదలైన పోస్టర్లు, టీజర్ సినిమా ఎంత పవర్‌ఫుల్‌గా ఉండబోతుందో తెలియజేస్తున్నాయి. ధనుష్ ఇందులో సరికొత్త, ఉగ్రమైన అవతారంలో కనిపించనున్నట్లు టీజర్ స్పష్టం చేస్తోంది. ధనుష్ సొంత నిర్మాణ సంస్థ వండర్‌బార్ ఫిల్మ్స్‌తో కలిసి ఆర్–టేక్ స్టూడియోస్ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నాయి. శ్రద్ధా అగర్వాల్, అజ్మత్ జగ్మద్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. సాయి అభ్యంకర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ సినిమాను 2026 అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. విభిన్నమైన కథాంశంతో, భారీ తారాగణంతో వస్తున్న ఈ చిత్రం కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# రెండో టీ20లో టీమిండియా భారీ విజయం... జింబాబ్వేపై సిరీస్ కైవసం

- బ్యాటింగ్, బౌలింగ్‌లో అదరగొట్టిన భారత్- రెండో టీ20లో 90 పరుగుల భారీ తేడాతో విజయం
- 2-0తో సిరీస్ కైవసం- అర్ధ సెంచరీలతో చెలరేగిన ఇషాన్ కిషన్, తిలక్ వర్మ- బౌలింగ్‌లో 3 వికెట్లతో రాణించిన అభిషేక్ శర్మ



జింబాబ్వే పర్యటనలో భారత జట్టు అద్భుత ప్రదర్శనను కొనసాగిస్తోంది. శనివారం హరారే వేదికగా జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. ఈ మ్యాచ్‌లో 90 పరుగుల భారీ తేడాతో జింబాబ్వేను చిత్తు చేసి, మరో మ్యాచ్ మిగిలి ఉండగానే మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2–0 తేడాతో కైవసం చేసుకుంది. తొలుత బ్యాటింగ్‌లో ఇషాన్ కిషన్, తిలక్ వర్మ విధ్వంసకర ఇన్నింగ్స్‌లతో చెలరేగగా, అనంతరం బౌలర్లు రాణించడంతో భారత్‌కు సునాయాస విజయం దక్కింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన జింబాబ్వే కెప్టెన్ సికిందర్ రజా బౌలింగ్ ఎంచుకున్నాడు. అయితే, అతని నిర్ణయం సరైంది కాదని భారత బ్యాటర్లు నిరూపించారు. ఓపెనర్లు అభిషేక్ శర్మ (8), వైభవ్ సూర్యవంశీ (20) త్వరగా పెవిలియన్ చేరినా, క్రీజులోకి వచ్చిన వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ (44 బంతుల్లో 81; 9 ఫోర్లు, 2 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగాడు. అతనికి తిలక్ వర్మ (29 బంతుల్లో 60 నాటౌట్; 5 ఫోర్లు, 3 సిక్సర్లు)



తోడవడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. వీరిద్దరూ అద్భుతమైన అర్ధ సెంచరీలతో భారత జట్టు భారీ స్కోరుకు బాటలు వేశారు. టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 219 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. భారీ లక్ష్య ఛేదనలో జింబాబ్వే ఏ దశలోనూ గెలుపు దిశగా సాగలేకపోయింది. ఓపెనర్ బ్రయాన్ బెన్నెట్ (19 బంతుల్లో 32 పరుగులు) దూకుడుగా ఆడినా, భారత బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీస్తూ ఒత్తిడి పెంచారు. కెప్టెన్ సికిందర్ రజా డకౌట్‌గా వెనుదిరగడం ఆ జట్టును కోలుకోలేని దెబ్బతీసింది. భారత బౌలర్లలో పార్ట్ టైమ్ స్పిన్నర్ అభిషేక్ శర్మ కేవలం 17 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టి జింబాబ్వే పతనాన్ని శాసించాడు. యశ్ ఠాకూర్, ప్రిన్స్ యాదవ్ చెరో రెండు వికెట్లు తీయగా.. రవి బిష్ణోయ్, శివమ్ దూబే, తిలక్ వర్మ తలో వికెట్ దక్కించుకున్నారు. దీంతో జింబాబ్వే 17.5 ఓవర్లలో 129 పరుగులకే ఆలౌట్ అయి ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. ఇక ఇరు జట్ల మధ్య మూడో టీ20 రేపు (జులై 26) జరగనుంది. ఈ మ్యాచ్‌కు కూడా హరారే స్పోర్ట్స్ క్లబ్ మైదానం వేదికగా నిలవనుంది.



## ఫిఫా వరల్డ్ కప్‌ల నుంచి అర్జెంటీనాను నిషేధించాలంటూ పిటిషన్... మండిపడిన దేశాధ్యక్షుడు

ఫిఫా వరల్డ్ కప్‌ల నుంచి అర్జెంటీనాను నిషేధించాలని ఆన్‌లైన్‌లో భారీ పిటిషన్
పిటిషన్‌కు మద్దతుగా 170 దేశాల నుంచి 2.3 కోట్ల మందికి పైగా సంతకాలు
ఇది మాపై అసూయతో జరుగుతున్న కుట్ర అంటూ స్పందించిన అధ్యక్షుడు జేవియర్ మిలే 2026 వరల్డ్ కప్ ఫైనల్లో స్పెయిన్ చేతిలో ఓటమి తర్వాత రాజుకున్న వివాదం ఫుట్‌బాల్ ప్రపంచంలో ఒక కొత్త వివాదం రాజుకుంది. భవిష్యత్తులో జరిగే ఫిఫా వరల్డ్ కప్‌ల నుంచి అర్జెంటీనాను నిషేధించాలంటూ దాఖలైన భారీ ఆన్‌లైన్ పిటిషన్‌పై ఆ దేశ అధ్యక్షుడు జేవియర్ మిలే తీవ్రంగా స్పందించారు. "ఇదంతా మాపై ఉన్న అసూయతోనే జరుగుతోంది" అంటూ ఆయన సోషల్ మీడియాలో ఆగ్రహం వ్యక్తం చేశారు. 2026 ఫిఫా వరల్డ్ కప్ ఫైనల్లో అర్జెంటీనా, స్పెయిన్ చేతిలో 1–0 తేడాతో ఓటమి పాలైన విషయం తెలిసిందే. ఈ టోర్నమెంట్‌లో అర్జెంటీనా జట్టు ఆటగాళ్ల ప్రవర్తన సరిగా లేదని, క్రమశిక్షణ ఉల్లంఘనలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ "అర్జెంటీనా ఔట్" పేరుతో ఒక పిటిషన్ మొదలైంది. దీనికి అనూహ్య స్పందన లభించింది. సుమారు 170 దేశాల నుంచి 2.33 కోట్ల మందికి పైగా ఈ పిటిషన్‌పై సంతకాలు చేశారు. అర్జెంటీనా ప్రవర్తన ఫుట్‌బాల్ క్రీడా స్ఫూర్తిని దెబ్బతీసిందని పిటిషన్‌లో ఆరోపించారు. ఈ పిటిషన్‌పై అధ్యక్షుడు మిలే ఇన్‌స్టాగ్రామ్‌లో స్పందిస్తూ, "మీకు శత్రువులు ఉన్నారంటే.. మీరు ఎప్పుడో ఒకప్పుడు దేనికోసమో బలంగా నిలబడ్డారని అర్థం. మేము అర్జెంటీనా కోసం నిలబడతాం. అందరిలో మేం ప్రత్యేకంగా నిలబడటమే అసలు సమస్య. మాపై అసూయ పడతారు. మేము దాదాపు అన్నింటిలోనూ ఉత్తమంగా ఉంటాం" అని పోస్ట్ చేశారు.

# ప్రజల విశ్వాసం కోల్పోయిన ప్రధాని నరేంద్ర మోడీ

**- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్**




**కడప – సూర్య వాస్తవం:** కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోడీ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ స్పష్టం చేశారు. కడపలోని తన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ యువత, విద్యార్థుల ముందు నియంతృత్వ ఎన్డీఏ ప్రభుత్వం తల వంచక తప్పలేదని స్పష్టం చేశారు. విద్యార్థులు మొక్కవోని ధైర్యంతో పోరాటం చేసి కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు ఉద్యమించారన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ, మత విద్వేష పరిపాలన చేస్తున్న నరేంద్ర మోడీ కి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఎనిమిది వందల నగరాలు, పట్టణాలు గ్రామాలలో ఆగ్రహ వేషాలు ప్రదర్శిస్తూ ఉద్యమం తీవ్ర రూపం దాల్చినట్లు వెల్లడించారు. అలాగే ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు, దేశవాసులు తీవ్ర నిరసనలు, ఆగ్రహ వేషాలు, ఆందోళనలు చేశారన్నారు. నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ కుంభకోణానికి బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసినప్పటికీ సమస్య పూర్తిగా సమసి పోలేదన్నారు. పార్లమెంటు ఆవరణలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ సీఎం గా గుజరాత్ లో ఏ విధంగా చేశారో అదే విధంగా జంతర్ మంతర్ లో పోరాటం చేస్తున్న విద్యార్థులు, యువతను ఉరితీసి కిందికి వేలాడదీసి యువతకు గుణపాఠం నేర్పాలని మీడియాతో చెప్పడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. పీస్ గోయల్ ఈ విధంగా దేశ యువతను ఉద్దేశించి ఒక కిరాతకుడిలా మాట్లాడడం పై దేశవ్యాప్తంగా నిరసనలు హోరెత్తుతున్నాయ న్నారు. సదరు మంత్రి పీయూష్ గోయల్ ధమనకాండ ప్రకటనతో భారతీయ జనతా పార్టీ నాయకులు, మంత్రులు, ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల వైఖరి ప్రజలకు పూర్తిగా బహిర్గతమైందన్నారు. కాక్రోజ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న యువతను అణిచి వేసేందుకు హోంమంత్రి అమిత్ షా పూర్తిస్థాయిలో పోలీసులు, సిఆర్పిఎఫ్ బలగాలను దుర్వినియోగం చేశారన్నారు. వందల మంది విద్యార్థులు తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు. అంతేకాకుండా సాయిల్ అనే విద్యార్థి కన్ను పోయి, అతడి శరీరమంతా పెల్లెట్ గన్స్ తో కాల్చడం వల్ల బాధపడుతున్న రాహుల్ గాంధీ మీడియా ముందు వెల్లడించారన్నారు. దీనికి హోంమంత్రి అమిత్ షా పూర్తిగా బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. 12 సంవత్సరాల పాటు భారతదేశాన్ని సర్వం నాశనం చేసిన నరేంద్ర మోడీ, అమిత్ షా కు రాబోయే రోజుల్లో ప్రజలు భరతవాక్యం పలుకుతారని హెచ్చరించారు. విద్యార్థులపై దమనకుండా కొనసాగించిన హోం మంత్రి అమిత్ షాను కూడా వెంటనే మంత్రి పదవి నుంచి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో పూర్తి స్థాయిలో అన్ని వర్గాల ప్రజల విశ్వాసం కోల్పోయిన ప్రధాని నరేంద్ర మోడీ, హోం మంత్రి అమిత్ షా నైతిక బాధ్యత వహిస్తూ తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజలు, మేధావులు అన్ని వర్గాల వారు చైతన్యవంతులై ఎన్డీఏ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలో భాగస్వాములు కావడంతో నరేంద్ర మోడీ బెంబేలెత్తిపోయి అధికారం చేజారకుండా అపసోపాలు పడుతున్నాడని ఎద్దేవా చేశారు. మరె ంతో కాలం హోంమంత్రి అమిత్ షా,ప్రధాని నరేంద్ర మోడీ మనుగడ సాధించలేరని హెచ్చరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ మయాన రహమతుల్లా ఖాన్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ ప్రతినిధి ఆబిద్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల పోరాటానికి తొలి విజయం

**-అన్నమయ్య డీసీసీ చీఫ్ సెక్రటరీ అమీర్**
**-కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బాబా సర్దార్**



**రాయచోటి–సూర్య వాస్తవం:** నీట్, సిబిఎస్ఈ పరీక్షల అక్రమాలపై కాంగ్రెస్ పార్టీ మరియు విద్యార్థి లోకం చేపట్టిన సుదీర్ఘ పోరాటానికి లభించిన తొలి విజయమే కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా అని జిల్లా కాంగ్రెస్ కమిటీ చీఫ్ సెక్రటరీ అమీర్ బాష అన్నారు. శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు...కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ఏపీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్. షర్మిలా రెడ్డి,డీసీసీ అధ్యక్షుడు గాజుల భాస్కర్ ల పిలుపు మేరకు శనివారం జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో సత్యాగ్రహ నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు.పరీక్షల నిర్వహణలో వైఫల్యం, విద్యార్థులపై జరిగిన అణచివేత చర్యలకు నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయడం తమ పోరాట ఫలితమేనన్నారు. అయితే కేవలం రాజీనామాతో సరిపోదని, అక్రమాలకు కారణమైన వారిపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలి, విద్యార్థులపై పెట్టిన తప్పుడు కేసులు ఎత్తివేయాలని కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. పరీక్షల నిర్వహణలో సమూల మార్పులు తీసుకొచ్చి, బాధితులైన విద్యార్థులందరికీ న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా రాయచోటి పట్టణ అధ్యక్షుడు బాబా సర్దార్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటోందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నీట్, సిబిఎస్ఈ పరీక్షల్లో జరిగిన అక్రమాల వల్ల లక్షలాది మంది విద్యార్థుల కష్టం, వారి తల్లిదండ్రుల నిరీక్షణ నీరుగారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖ మంత్రి రాజీనామా అనేది విద్యార్థుల పోరాటానికి లభించిన ప్రారంభ విజయం మాత్రమేనని, బాధితులకు తగిన న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ విద్యార్థుల తరఫున క్షేత్రస్థాయిలో పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు దుగ్గనపల్లి సురేంద్ర రెడ్డి, సేవాదళ్ అధ్యక్షుడు అమీర్ భాష, డిసిసి జనరల్ సెక్రెటరీ ఖాదర్ ఖాన్, మస్తాన్, సెక్రటరీ మహమ్మద్ రఫీలు పాల్గొన్నారు.

# అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలి

**- ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా చూడాలి**
**- మండల సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్ రెడ్డి**



**అన్నమయ్య బ్యూరో –సూర్య వాస్తవం:** అధికారులు బాధ్యతాయుతంగా పని చేయడంతో పాటు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు సక్రమంగా అందాల చూడాలని రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. శనివారం రాయచోటి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీలు సర్పంచులతో పాటు మండల స్థాయి అధికారులు,సిబ్బందితో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు, రాష్ట్ర ఐటీ,విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు లు ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు.ప్రజా సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేదలను ఆదుకుంటున్నారని కొనియాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే అంత మందికి తల్లికి వందనం పథకం కింద నగదు జమ చేయడం, ఎన్టీఆర్ వైద్య సేవ కింద ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడం, ప్రతి నెల ఒకటో తేదీన వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు పెన్షన్లు పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధి కూడా అదే స్థాయిలో చేపడుతూ గత వైసిపి ప్రభుత్వంలో రాష్ట్రము నుంచి వెళ్లిపోయిన ఎన్నో కంపెనీలను తిరిగి రాష్ట్రానికి తెస్తూ లక్షలాదిమంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించేందుకు కృషి చేస్తున్నారని చెప్పారు. అధికారులు కూడా బాధ్యతా యుతంగా పనిచేస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అభివృద్ధి కార్య క్రమాలను గ్రామీణ ప్రాంతాలకు తీసుకెళ్లి అర్హులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. అనంతరం ఆయా శాఖలకు సంబంధించిన అధికారులు వారి శాఖల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి సంక్షేమ పథకాల గురించి సమావేశంలో వివరించారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజమ్మ,వైస్ ఎంపీపీలు, ఎంపీడీవో పరిపూర్ణ అరుంధతి,ఎంపీటీసీలు సర్పంచులు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మైనార్టీ నాయకులు జనసేన పార్టీలో చేరిక



**హైదరాబాద్–సూర్య వాస్తవం:** జనసేన పార్టీ గ్రేటర్ రాయలసీమ జాయినింగ్ కమిటీ చైర్మన్ బాలినేని శ్రీనివాస రెడ్డి, జాయింట్ సెక్రెటరీ తాళ్లూరి రామ్ ల ఆధ్వర్యంలో తిరుపతికి చెందిన జనసేన పార్టీ సీనియర్ నాయకులు మైలు రాము, కోడూరు కు చెందిన జనసేన పార్టీ సీనియర్ నాయకులు గంధం శెట్టి దినకర్ బాబు సహకారంతో శనివారం హైదరాబాదులో ఆంధ్రప్రదేశ్ అన్నమయ్య జిల్లారాయచోటి కు చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య మైనార్టీ నాయకులు జనసేన పార్టీలో చేరారు. వీరికి ఆ పార్టీ రాష్ట్ర నాయకులు జనసేన కండువా కప్పి సాధారణంగా పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఆడిటర్ మన్సూర్ అలీ ఖాన్ మాట్లాడుతూ జనసేన పార్టీలో చేరి పార్టీ సభ్యత్వం తీసుకున్నందుకు చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన జనసేన పార్టీ అధినేత ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బాలినేని శ్రీనివాస్ రెడ్డి, తాళ్లూరి రామ్ లకు కృతజ్ఞతలు తెలిపారు. జనసేన పార్టీ సిద్ధాంతాన్ని పవన్ కళ్యాణ్ నాయకత్వాన్ని కడప మరియు అన్నమయ్య జిల్లాలో ఉన్న ముస్లిం సమాజంలో క్షేత్రస్థాయిలో తీసుకొని వెళ్లి రాబోయే రోజుల్లో ముస్లిం మైనారిటీ ప్రజలకు పార్టీలో చేర్పించడానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. పార్టీలో చేరడానికి సహకరించిన జనసేన పార్టీ సీనియర్ నాయకులు అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఘనంగా మంచా నాగ మల్లేశ్వరి జన్మదిన వేడుకలు



**ప్రొద్దుటూరు – సూర్య వాస్తవం:** మాల మహానాడు జి.చెన్నయ్య వర్గం జాతీయ మహిళా అధ్యక్షురాలు మంచా నాగమల్లేశ్వరి పుట్టినరోజు వేడుకలు కడప జిల్లా అధ్యక్షులు జేష్ఠది భాస్కర్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా ప్రొద్దుటూరులో నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్, ప్రొటెక్షన్, కమిటీ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ, మేకల వెంకటన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా కడప జిల్లా అధ్యక్షులు, జేష్ఠది భాస్కర్ మరియు, వెంకటన్న మాట్లాడుతూ నాగమల్లేశ్వరి దళితుల సమస్యల మీద, రెండు తెలుగు రాష్ట్రాలలో, మంచి పట్టున్న నాయకురాలు అని దళిత సమస్యల మీద పోరాడుతున్న నాయకురాలని, కొనియాడారు. తదుపరి కేకు కట్ చేసి, పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది, కార్యక్రమంలో భాగంగా ప్రొద్దుటూరు తాలూకా అధ్యక్షులు, జేష్ఠది మధు, ప్రొద్దుటూరు పట్టణ యూత్ ప్రెసిడెంట్ జాస్వర్, ప్రొద్దుటూరు తాలూకా యూత్ ప్రెసిడెంట్, మోపురి పుష్పరాజ్, ప్రొద్దుటూరు పట్టణకార్యదర్శి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## నీటి సమస్య పరిష్కారం కోరుతూ ఎమ్మెల్యేకు విజ్ఞప్తి



**ప్రొద్దుటూరు – సూర్య వాస్తవం:** తమ ప్రాంతానికి నీటి సరఫరా అంతంత మాత్రంగానే ఉందని వెంటనే జోక్యం చేసుకుని నీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ 9 వ వార్డు ప్రజలు మాజీ కౌన్సిలర్ జిలానీ బాషా ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ని కలిసి విన్నవించారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం శ్రీనివాస నగర్ ప్రజలు మాజీ కౌన్సిలర్ జిలానీ బాషా లు మీడియాతో మాట్లాడుతూ గత రెండు నెలలుగా నీటి సరఫరా లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అని తెలిపారు. మున్సిపల్ అధికారులను కలిసి విన్నవించినా ఫలితం లేకపోవడంతో విషయం ఎమ్మెల్యే దృష్టి కి తీసుకెళ్ళడం జరిగిందని పేర్కొన్నారు.

## ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావం..

**- పండ్ల తోటల్లో వీడ్ మ్యాట్లు ఏర్పాటు చేసుకోవాలి**
**- ఉద్యానశాఖ అధికారి శ్రీనివాసులరెడ్డి**



**బ్రహ్మంగారిమఠం– సూర్య వాస్తవం :** జూలై నెల ముగింపు దశకు చేరుకున్నప్పటికీ ఎల్‌నినో ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదు కాక పోవడంతో రైతులు తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనే అవకాశం ఉందని ఉద్యానశాఖ అధికారి శ్రీనివాసులరెడ్డి తెలిపారు.వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ముందస్తుగా నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న నిమ్మ, బత్తాయి, మామిడి వంటి పండ్ల తోటల్లో వీడ్ మ్యాట్లు ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేలలో తేమను ఎక్కువకాలం నిల్వ ఉంచడంతో పాటు కలుపు మొక్కల పెరుగుదలను నియంత్రించవచ్చని తెలిపారు. దీంతో నీటి వినియోగం తగ్గి పంటలు ఎండబారకుండా రక్షించుకోవచ్చని వివరించారు.వాతావరణ మార్పుల నేపథ్యంలో ప్రతి నీటి బొట్టును ఆదా చేసేలా రైతులు ఆధునిక నీటి సంరక్షణ పద్ధతులను అవలంబించాలని, ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని శ్రీనివాసులరెడ్డి కోరారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9885404140 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad 9948461699 )

# నీట్ పరీక్షా వ్యవస్థపై దేశవ్యాప్తంగా తిరుగుబాటు..!

- యువత పోరాటానికి కేంద్రం తలవంచింది...
- విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా!
- దేశవ్యాప్తంగా యువత ఆగ్రహం ఫలించింది
- పరీక్షా వ్యవస్థలో సమూల సంస్కరణలకు కేంద్రం సిద్ధం
- ప్రజాస్వామ్య విజయమా..? ప్రభుత్వ వైఫల్యమా..? - దేశవ్యాప్తంగా చర్చ




న్యూఢిల్లీ -సూర్యవాస్తవం

దేశంలో గత కొన్నేళ్లుగా ఎన్నడూ లేని విధంగా విద్యార్థులు, నిరుద్యోగ యువత చేపట్టిన భారీ ఉద్యమం కేంద్ర ప్రభుత్వాన్ని కీలక నిర్ణయం తీసుకునేలా చేసింది. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చిన నీట్ వైద్య ప్రవేశ పరీక్ష ప్రశ్నపత్రం లీక్ వివాదం చివరకు కేంద్ర కేబినెట్‌లోనే ప్రకంపనలు సృష్టించింది. దేశవ్యాప్తంగా కొనసాగిన నిరసనలు, పార్లమెంట్ ముట్టడి ప్రయత్నాలు, ఢిల్లీలో పోలీసులతో ఘర్షణలు, ప్రతిపక్షాల విమర్శలు, ప్రజల నుంచి పెరిగిన ఒత్తిడి నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించడం దేశ రాజకీయాల్లో సంచలనంగా మారింది. ఇది కేవలం ఒక మంత్రి రాజీనామా మాత్రమే కాదని, దేశ విద్యా వ్యవస్థపై యువత వ్యక్తం చేసిన అసంతృప్తికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన తొలి రాజకీయ స్పందనగా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా ఉద్యమం ఒత్తిడితో ఒక కీలక మంత్రి పదవి నుంచి తప్పుకోవడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

### దేశాన్ని కుదిపేసిన నీట్ పేపర్ లీక్

దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన వైద్య విద్యా ప్రవేశ పరీక్ష అయిన నీట్ లో ప్రశ్నపత్రం పరీక్షకు ముందే లీక్ అయిందన్న ఆరోపణలు వెలుగులోకి రావడంతో దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళన వ్యక్తమైంది. కోట్ల రూపాయలకు ప్రశ్నపత్రాలు విక్రయించారని, కొందరు అభ్యర్థులు అక్రమ మార్గాల్లో ర్యాంకులు సాధించారని వచ్చిన ఆరోపణలు లక్షలాది మంది నిజాయితీగా పరీక్ష రాసిన విద్యార్థులను తీవ్ర నిరాశకు గురిచేశాయి. దీంతో పరీక్షలను రద్దు చేయాలా? మళ్లీ నిర్వహించాలా? అనే అంశంపై దేశవ్యాప్తంగా చర్చ మొదలైంది. పలు రాష్ట్రాల్లో విద్యార్థులు రోడ్లపైకి వచ్చి నిరసనలు చేపట్టారు. వేలాది కుటుంబాలు తమ పిల్లల భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తం చేశాయి.

### 'కాక్‌రోచ్ జనతా పార్టీ' నుంచి జాతీయ ఉద్యమం వరకు...

ఈ ఉద్యమానికి నాయకత్వం వహించిన కాక్‌రోచ్ జనతా పార్టీ (సిజెపి ) ప్రారంభంలో సోషల్ మీడియాలో ఒక వ్యంగ్య ఉద్యమంగా మొదలైంది. అయితే కొద్ది రోజుల్లోనే అది దేశవ్యాప్తంగా యువత ఆవేదనకు ప్రతీకగా మారింది. బోస్టన్ యూనివర్సిటీలో చదివిన అభిజీత్ దిప్కే నాయకత్వంలో వేలాది మంది విద్యార్థులు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన శిబిరాలు ఏర్పాటు చేశారు. తర్వాత దేశంలోని వివిధ రాష్ట్రాల్లో కూడా ఉద్యమం విస్తరించింది. ఈ ఉద్యమం కేవలం నీట్ పరీక్షలకే పరిమితం కాలేదు. నిరుద్యోగం, పరీక్షల నిర్వహణలో అవినీతి, అవకాశాల కొరత, యువత భవిష్యత్తుపై ప్రభుత్వ నిర్లక్ష్యం వంటి అనేక అంశాలపై యువత గళమెత్తింది.

### ఉద్రిక్తంగా మారిన ఢిల్లీ...

ఆందోళనలు రోజురోజుకూ ఉధృతం కావడంతో వేలాది మంది విద్యార్థులు పార్లమెంట్ వైపు భారీ ర్యాలీ చేపట్టారు. వారిని అడ్డుకునేందుకు ఢిల్లీ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పలు ప్రాంతాల్లో విద్యార్థులు, పోలీసుల మధ్య తోపులాటలు జరిగాయి. టియర్ గ్యాస్ ప్రయోగం, లాఠీచార్జ్ జరిగిన దృశ్యాలు దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయి. సోషల్ మీడియాలో లక్షలాది మంది ఈ ఘటనలను ఖండిస్తూ విద్యార్థులకు మద్దతు తెలిపారు.

### ప్రధాని మోదీ ఏమన్నారు...?

ఉద్యమం ఉద్ధృతంగా సాగుతున్న సమయంలో తొలిసారిగా స్పందించిన ప్రధాని నరేంద్ర మోదీ, విద్యార్థుల ఆందోళనను ప్రభుత్వం గౌరవిస్తుందని చెప్పారు. "పేపర్ లీక్ ఘటన వెలుగులోకి వచ్చిన వెంటనే ప్రభుత్వం కఠిన చర్యలు ప్రారంభించింది. బాధ్యులను అరెస్టు చేశాం. విద్యార్థుల విద్యా సంవత్సరం వృథా కాకుండా చూడటం మా తొలి బాధ్యత. పరీక్షా వ్యవస్థను మరింత బలోపేతం చేసి, ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా సంస్కరణలు తీసుకొస్తాం" అని ఆయన తెలిపారు. అలాగే యువత భవిష్యత్తు దేశ భవిష్యత్తుతో ముడిపడి ఉందని, వారికి న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు.

ధర్మేంద్ర ప్రధాన్ భావోద్వేగ రాజీనామా

శనివారం తన రాజీనామాను ప్రకటించిన ధర్మేంద్ర ప్రధాన్, దేశ ప్రజలకు రాసిన లేఖలో భావోద్వేగ వ్యాఖ్యలు చేశారు. "నా పదవి కంటే దేశ యువత భవిష్యత్తే గొప్పది. విద్యార్థుల చదువు ఎలాంటి న్యాయపరమైన చిక్కుల్లో పడకూడదు. దేశ ఐక్యతకు ఎలాంటి విఘాతం కలగకూడదు. ఈ పరిస్థితిని రాజకీయ ప్రయోజనాల కోసం ఎవరూ ఉపయోగించుకోకుండా ఉండాలనే ఉద్దేశంతో నైతిక బాధ్యత వహిస్తూ నేను రాజీనామా చేస్తున్నాను" అని పేర్కొన్నారు. ప్రధాని మోదీ తనపై ఉంచిన విశ్వాసానికి కృతజ్ఞతలు తెలుపుతూ, విద్యా రంగంలో చేపట్టిన సంస్కరణలను కొనసాగించాలని కోరారు.

### రాహుల్ గాంధీ మాట్లాడుతూ

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఈ పరిణామాన్ని విద్యార్థుల పోరాట విజయంగా అభివర్ణించారు. "విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసిన వ్యవస్థకు బాధ్యత వహించాల్సింది కేవలం మంత్రి మాత్రమే కాదు. ప్రభుత్వం కూడా బాధ్యత తీసుకోవాలి. దేశ యువత విశ్వాసాన్ని తిరిగి పొందాలంటే పరీక్షా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాలి" అని ఆయన పేర్కొన్నారు. కేవలం రాజీనామాతో సమస్య పరిష్కారం కాదని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

### జంతర్ మంతర్‌లో విజయోత్సాహం... ఉద్యమకారుల ఆనందానికి అవధుల్లేవు

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా వార్త వెలువడిన వెంటనే ఢిల్లీలోని జంతర్ మంతర్ ఉద్యమ కేంద్రం విజయో త్సాహంతో మార్మోగింది. గత కొన్ని వారాలుగా అక్కడే బస చేస్తూ నిరసనలు కొనసాగించిన వేలాది మంది విద్యార్థులు, యువత, ఉద్యోగార్థులు ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. చేతుల్లో జాతీయ జెండాలు, ఉద్యమ బ్యానర్లు పట్టుకుని నినాదాలు చేస్తూ సంబరాలు జరుపుకున్నారు. కొందరు మిఠాయిలు పంచిపెట్టగా, మరికొందరు డప్పులు మోగిస్తూ నృత్యాలు చేశారు. పలువురు విద్యార్థులు భావోద్వేగంతో కన్నీళ్లు పెట్టుకుంటూ, "ఇది మా విజయం కాదు... దేశంలోని ప్రతి విద్యార్థి విజయం" అంటూ స్పందించారు. వార్తా చానళ్ల ప్రత్యక్ష ప్రసారాల్లో ఈ దృశ్యాలు దేశ ప్రజలను ఆకట్టుకున్నాయి. ఉద్యమానికి నాయకత్వం వహించిన అభిజీత్ దిప్కే మాట్లాడుతూ, "ఇది ప్రజాస్వామ్య తొలి విజయం మాత్రమే. విద్యార్థుల స్వరం దేశ పాలకులు వినాల్సి వచ్చింది. అయితే మా పోరాటం ఇక్కడితో ముగియదు. ఇంకా రెండు కీలక డిమాండ్లు నెరవేరాల్సి ఉంది" అని స్పష్టం చేశారు. పరీక్షా వివాదం కారణంగా ప్రాణాలు కోల్పోయినట్లు నివేదించబడిన విద్యార్థుల కుటుంబాలకు రూ.1 కోటి చొప్పున పరిహారం, అలాగే నిరసనకారులపై లాఠీచార్జ్ చేసిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అంతేకాకుండా, జాతీయ స్థాయి పోటీ పరీక్షల నిర్వహణకు స్వతంత్ర, పారదర్శక వ్యవస్థను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

జంతర్ మంతర్‌లో విద్యార్థుల మధ్య ఒకే నినాదం మార్మోగింది---"ఈ విజయం రాజీనామాతో ముగియదు... పరీక్షా వ్యవస్థలో సమూల సంస్కరణలు జరిగే వరకు మా పోరాటం కొనసాగుతుంది." వేలాది మంది యువత ఒకే స్వరంతో "ఎడ్యుకేషన్‌కు న్యాయం కావాలి", "పేపర్ లీక్‌లకు శాశ్వత చెక్ పెట్టాలి", "విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడొద్దు" అంటూ నినాదాలు చేశారు.

### ప్రజాస్వామ్యానికి కొత్త సందేశం

రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం ఈ పరిణామం భారత ప్రజాస్వామ్యంలో ఒక కీలక మలుపుగా నిలిచే అవకాశం ఉంది. యువత సమస్యలను నిర్లక్ష్యం చేస్తే ఏ ప్రభుత్వం అయినా ప్రజా ఒత్తిడిని ఎదుర్కోవాల్సి వస్తుందనే సందేశాన్ని ఈ ఉద్యమం ఇచ్చిందని వారు పేర్కొంటున్నారు. రైతుల ఉద్యమం తర్వాత మరోసారి విద్యార్థుల ఉద్యమం కేంద్ర ప్రభుత్వాన్ని కీలక నిర్ణయం తీసుకునేలా చేయడం దేశ రాజకీయాల్లో ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకుంది.


### దేశం ఎదురుచూస్తోంది... ఇకపై ఏమవుతుంది?

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో ఒక అధ్యాయం ముగిసినా, అసలు సవాలు ఇప్పుడు ప్రారంభమైంది. దేశంలోని కోట్లాది మంది విద్యార్థులు పరీక్షా వ్యవస్థలో పారదర్శకత, న్యాయం, సాంకేతిక భద్రత, అవినీతి నిర్మూలన కోసం కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఒక ప్రశ్నపత్రం లీక్‌తో మొదలైన ఈ ఉద్యమం... చివరకు దేశ విద్యా విధానంపైనే పునరాలోచనకు దారితీసింది. యువత గళం వినిపిస్తే మార్పు సాధ్యమేనని మరోసారి భారత ప్రజాస్వామ్యం నిరూపించింది.









### ఉద్యమం ఆగలేదు... ఇంకా రెండు డిమాండ్లు

సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే మాట్లాడుతూ..."ఇది మా తొలి విజయం మాత్రమే. విద్యార్థుల కుటుంబాలకు న్యాయం జరిగే వరకు ఉద్యమం కొనసాగుతుంది" అన్నారు.

**వారి ప్రధాన డిమాండ్లు:**

- పరీక్షా వివాదం కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు రూ.1 కోటి పరిహారం.
- విద్యార్థులపై నమోదైన కేసుల ఉపసంహరణ.
- లాఠీచార్జ్‌కు బాధ్యులైన పోలీసు అధికారులపై చర్యలు.
- జాతీయ పరీక్షల నిర్వహణకు స్వతంత్ర పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు.
- ప్రశ్నపత్రాల భద్రతకు అత్యాధునిక సాంకేతిక విధానాల అమలు.

# సొంత నిధులతో వ్యాపారాభివృద్ధికి ఆర్థిక సాయం

- అందిస్తున్న సామాజిక సేవకులు గోళ్ళ రాజేష్
- వ్యాపార అభివృద్ధికి వడ్డీ లేని ఆర్థిక సహకారం
- మొదటి విడతలో ఐదు మందికి వడ్డీలేని రుణాలు
- రూ.2.50,000లక్షల చెక్కులను గోళ్ళ రాజేష్ అందజేత





నంద్యాల -సూర్య వాస్తవం

ప్రస్తుతం వ్యాపారాలు నిర్వహించుకుంటున్న వ్యాపారస్తులు కొంతమంది వ్యాపార నిర్వహణకు వడ్డీకి రుణాలు తీసుకొని ఒక వైపు వ్యాపారాలు మందగించి మరోవైపు వడ్డీలు చెల్లిస్తు కుటుంబ పోషన భారమై కొంతమంది వ్యాపారస్తులు ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులకు గురౌతున్న నేపథ్యంలో వారిని గుర్తించిన గోళ్ళ రాజేష్ వారిని వారి కుటుంబాలకు ఆర్థికంగా చేయూతను ఇవ్వాలనే సదుద్దేశంతో తన సొంత నిధులతో నంద్యాల వ్యాపారస్తులకు ఆర్థిక భరోసనిస్తు వారిలో ఆత్మస్థైర్యం నింపేలా ఇలాంటి కార్యక్రమాలను ఏర్పాటు చేయస్తున్న గోళ్ళ రాజేష్ ను అభినందిస్తున్నారు ప్రజలు. ఈ సందర్భంగా గోళ్ళ రాజేష్ కార్యక్రమాల సమన్వయకర్త రిపోర్టర్ నూర్ బాషా మాట్లాడుతూ నంద్యాల నియోజకవర్గంలో గోళ్ళ రాజేష్ సహకారంతో ఎన్నో సేవా కార్యక్రమాలు, ఆర్థిక సహకారాలు, అందిస్తున్న విషయం నంద్యాల నియోజకవర్గ ప్రజలందరికీ విదితమేనని వడ్డీలేని ఆర్థిక సహకారం అందించడం ఇలాంటి కార్యక్రమాల వల్ల వ్యాపారం నిర్వహించే పేద, మద్యతరగతి ప్రజలకి వడ్డీ లేని ఋణాలు అందించడం వల్ల వ్యాపారాలు నిర్వహిస్తున్న వారి మనసుకు ఊరటనిచ్చేదే కాకుండా వారి కుటుంబాలలో సుఖసంతోషాలను,ఆత్మస్థైర్యాన్ని నింపుతుందని వడ్డీ లేకుండా గోళ్ళ రాజేష్ తన సొంత నిధులతో 2.50,000 రెండు లక్షల 50 వేల రూపాయల ఐదు మందికి అందించారు. ఆర్థిక సహాయాన్ని అందించే కార్యక్రమం వ్యాపారస్తుల కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసే విధంగా సహకరిస్తుందని ఆదిశగా గోళ్ళ రాజేష్ ముందుకు వెళుతున్నారని రాబోవు కాలంలో నంద్యాల నియోజకవర్గంలోని ప్రజలకు గోళ్ళ రాజేష్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, సహాయ సహకారాలు అందించాలని భగవంతుడు వారికి అష్టైశ్వర్యాలను ప్రసాధించాలని నంద్యాల నియోజకవర్గ ప్రజలందరి ఆశీర్వచనాలు గోళ్ళ రాజేష్ పై ఎల్లప్పుడు ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు మాట్లాడుతూ ఇటీవల కాలంలో వ్యాపారాలు మందగించడం వల్ల ఇబ్బంది కరమైందని ఒకవైపు వడ్డీలు చెల్లించుకుంటూ మరోవైపు కుటుంబాన్ని భారంగా పోషించుకుంటున్నా మని ఎప్పుడూ ఏ నాయకుడు కూడా తమ గోడును పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు కానీ గోళ్ళ రాజేష్ తమకు ఎలాంటి పరిచయం లేకుండా ఎలాంటి హామీలు ఎలాంటి షూరిటీలు లేకుండా తమ మీద నమ్మకం తోటి తమ వ్యాపార అభివృద్ధికి 50,000వేల రూపాయల వడ్డి లేని ఆర్థిక సహకారం అందించిన గోళ్ళ రాజేష్ కే చెల్లిందని వారికి జీవితాంతం ఋణపడి ఉంటామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులందరు హనుమంతు కరి శంకర్ రావు, రజియాబి, సనావుల్లా,షేక్ ఇబ్రహీం తదితరులు ఆనందం వ్యక్తం చేశారు.



# ఘనంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు...!

- శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామివారి ఉత్సవ విగ్రహాల వైభవోపేత ఊరేగింపు



**పత్తికొండ టౌన్ - సూర్య వాస్తవం :** పత్తికొండ పట్టణంలో వెలసిన కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ పవిత్ర పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, అలంకార సేవలు, విశేష పూజలు నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వైకుంఠ ద్వార దర్శనం కోసం ఉదయం నుంచే ఆలయ ప్రాంగణం భక్తజనంతో కిక్కిరిసిపోయింది. "గోవిందా... గోవిందా..." నామస్మరణల మధ్య భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదం, లడ్డూ ప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామివారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాలు, భజన బృందాలు, మంగళ వాయిద్యాల నడుమ పట్టణ పురవీధుల గుండా వైభవంగా ఊరేగించారు. ఈ ఊరేగింపులో మహిళలు హారతులతో స్వాగతం పలకగా, భక్తులు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారి దర్శనంతో తమ జన్మ ధన్యమైందని భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు సుమంత్ మాట్లాడుతూ, ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా వైకుంఠ ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. భక్తుల సహకారంతో కార్యక్రమం విజయవంతంగా జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు, సేవాదళం సభ్యులు, పట్టణ ప్రముఖులు, మహిళలు, యువకులు, చిన్నారులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.